# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక


శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



సంపాదక వర్గము

గూడూరి వెంకట రత్నం

డి.జె. బాలకృష్ణ లాల్

డా॥ఎస్. రామతారక పరబ్రహ్మ శాస్త్రి

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి



సంపుటి 35 సంచిక 4
పేజీలు 40
జనవరి 2016

5సం॥ల చందా రూ. 250
2సం॥ల చందా రూ. 120
సంవత్సర చందా రూ. 60
విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్, A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి. M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు

printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL


**ఈ సంచికలో** ........................ ....... **పేజీ**


భద్రవాక్యం ........................................2
శ్రీబాబూజీ ఉవాచ...................................3
అమ్మమాట..............................................6
బంగారు క్షణాలు ...................................9
సన్నిధిలో సంభాషణ ..............................11
పరమపూజ్య శ్రీ విద్యాస్వరూపానంద స్వామి వారి ప్రవచనం ..................................13
పరమపూజ్య శ్రీదండి నిర్మలానంద స్వామి వారి ప్రవచనం ..................................16
పరమపూజ్య శ్రీమాతాజ్యోతిర్మయానంద భారతివారి ప్రవచనం ..........................18
యోగవాశిష్ఠము ...................................19
మహాభారత నీతి చంద్రిక.......................21
శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు...................23
పరిప్రశ్నేన సేవయా ..............................24
శ్రీకాళీవనాశ్రమము..............................25
శ్రీకృష్ణకర్ణామృతము............................26
కర్మయోగము .......................................28
అమృతబిన్దూపనిషత్ ..........................30
అమెరికా పర్యటనలో శ్రీమాతాజీ బోధ........32
సత్సంగామృతం....................................35
సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర..........37
విష్ణు కథలు– భక్త కబీర్‌దాస్.................39

# భద్రవాక్యం

- పరాశర ప్రసాద్

విద్యాంచావిద్యాంచ యస్తద్వేదో భయగ్ం సహ ।
అవిద్యయా మృత్యుం తీర్త్వా విద్యయాఽమృతమశ్నుతే ॥

ఈశావాశ్యోపనిషత్ 11 శ్లో॥

అవిద్య అంటే అక్షర జ్ఞానం లేకపోవటమని భావన చేయరాదు. అవిద్య అంటే అజ్ఞానము, దేహభావన. దేహము 'నేను' అనే భావన. ఆ భావన చేత అహంకారము జనిస్తుంది. నా అంతటి విద్యావంతుడు, ప్రజ్ఞావంతుడు లేడన్న భావం కలుగుతుంది. దాని ద్వారా వ్యవహారిక ప్రపంచంలో అనేక సమస్యలను యెదుర్కొన వలసి వస్తుంది. అవిద్య చేత రాగద్వేషాలు, సుఖఃదుఖాలకు గురి కావలసి వస్తుంది.

ఎంత ధనం ఆర్జించినా, కీర్తి ప్రతిష్ఠలు సంపాదించినా దేహం పరిణామము చెందక తప్పదు కదా! ఏ మాత్రం ఆరోగ్యం క్షీణించినా, యెప్పుడు మృత్యువుబారిన పడవలసి వస్తుందో అన్న భీతితో జీవిస్తాడు. అన్నీ వున్నా, శాంతి వుండదు. దీనిని అతిక్రమించాలంటే అవిద్యని అధిగమించే మార్గాన్ని అన్వేషించాలి. అది కేవలం గ్రంథపఠనం ద్వారా కలిగే శాస్త్రజ్ఞానం వలన సంపాదించటం అసంభవం. శాస్త్ర జ్ఞానంతో తృప్తిపడిన మానవుడు వట్టి చేతులతో మట్టిపాలు కాకతప్పదు కదా. అందువలన ఆ స్థితినుండి బయటపడాలంటే నిజమైన విద్య యేది? దాన్ని యెలా పొందాలి?

ఆ బ్రహ్మవిద్యను పొందే విధానాలను తెలుసుకోవాలి. అది సద్గురుమూర్తి సమాశ్రయం ద్వారా మాత్రమే సంప్రాప్తిస్తుంది. అంతే కాదు శాస్త్రంలో సూచించిన విధానాలను సద్గురుమూర్తి సందేశంతో సమన్వయ పరచుకుని, అనుభవానికి తెచ్చుకున్న సాధకుడు మృత్యువును అధిగమించి, అమృతత్వాన్ని పొందటం తథ్యం! అని శ్లోకం వివరిస్తోంది.

# శ్రీ బాబూజీ ఉవాచ - పరాశర ప్రసాద్

శ్రీ బాబూజీ మహరాజ్ ఉదయం ఆయనతో వ్యాహ్యాళిలో పాల్గొన్న భక్తులకు బోధచేస్తూ "సాధన ఏకాంతంగా బాగుంటుందా? లేక అందరిమధ్య అనుకూలంగా ఉంటుందా?" అని డా॥ రంగరాజు గారిని ప్రశ్నించారు. ఆయన సమాధానం చెబుతూ "నాకు సాధన ఏకాంతములోనే బాగుంటుంది. పదిమందిలో కూర్చుని నేను ధ్యానం చేసుకోలేను. అలా ధ్యానం చేస్తే నా మనస్సు ఆందోళన చెందుతుంది" అని అన్నారు. మూర్తిగారు కలగజేసుకుని "నాకు మాత్రం సాధన గురుసాన్నిధ్యంలో బాగుంటుంది. అది నా వ్యక్తిగత అభిప్రాయం బాబూ" అన్నారు.



శ్రీ బాబూజీ మహరాజ్ తిరిగి ప్రశ్నిస్తూ "అయితే ఇక్కడ గురుసాన్నిధ్యంలో ఉండకుండా హైదరాబాద్‌లో ఉద్యోగం చేసుకుంటూ ఆ విషయాన్ని ఎలా చెప్పగలుగుతున్నావు? ఇక్కడ రెండు రోజులు ఉండమంటే నాకు సెలవులేదు. నేను వెంటనే వెళ్ళిపోవాలి అని అంటావుకదా! మరి గురు సాన్నిధ్యంలో సాధన బాగుంటుంది. అని ఎలా చెప్పగలిగావు? దానికి కారణమేమిటి?" అని ప్రశ్నించారు.

శ్రీ మూర్తీజీ సమాధానం చెబుతూ"గురు సాన్నిధ్యంలో సాధకునికి గుణాలు అదుపులో ఉంటాయి, విజృంభించవు. అవి ప్రేరణ చెందినా గురుమూర్తి వాటి తోక కత్తిరిస్తారు" అన్నారు.

వెంటనే శ్రీ బాబూజీ "గురుదేవుడు సమర్థుడా? అసమర్థుడా? సమర్థుడైన గురుమూర్తిని ఆశ్రయించినపుడు మీరంతా మొండితోకతో ఎలా ఉంటారయ్యా! సమర్థుడైన గురుదేవుడు గుణాలని ఆమూలాగ్రంగా తొలగిస్తాడు కదా! దానికి భిన్నంగా కత్తిరిస్తే అవి పెరిగి విజృంభించే అవకాశం ఉంది. నీ తలమీద కత్తిరించిన వెంట్రుకలు ఎలా తిరిగి మొలుస్తున్నాయో అలాగే సంకల్పాలను, గుణాలను బలవంతంగా అదుపుచేసినా, తాత్కాలికంగా నిలిపివేసినా అవి నిష్క్రమించినట్లు కనబడతాయి కానీ, సమయం వచ్చినపుడు పొంచి ఉండి ఇదివరకు కన్నా ఇంకా ఎక్కువ శక్తితో పంజాదెబ్బకొట్టి విజృంభణ చేస్తాయి సుమా! కాబట్టి నువ్వు ఆశ్రయించిన సమర్థుడైన సద్గురుమూర్తి అవి తిరిగి మొలకెత్తకుండా మూలంతో పెకలించి

వేస్తారు. అందువలన గురుసన్నిధిలో సాధన చేయడం ఉత్తమమే. అంతేకాదు గురుసన్నిధిలో మాయాశక్తి అణిగి ఉంటుంది. అది ఆయన ఆధీనంలో వుంటుంది. సాధకునికి మాయ ఆవరించే అవకాశం తక్కువ.

నేను నా చిన్నతనంలో ఏకాంతంగానే సాధన చేసుకునే వాడిని. సాధకుడు ముందుగా మనస్సు ఏకాగ్రతను సాధించేవరకు ధ్యానం ఏకాంతంగా చేసుకోవడమే మంచిది. మనస్సు బాహ్యశబ్దాలకు ప్రభావితం కాకుండా జాగ్రత్తపడాలి. మనస్సు నిలబడిన తరువాత ఏ ప్రదేశంలో కూర్చొని ధ్యానం చేసుకున్నా, శబ్ధ, స్పర్శ, రూప, రస, గంధాలు ఏరకమైన ఆటంకాలనీ కలిగించవు. సాధనలో ముందుగా శబ్దాన్ని జయించాలి. అందువలన ఏకాంతంగా ఏ చెట్టుక్రిందనో, ఏ దేవాలయంలోనో లేక ఏదైన నిర్జన ప్రదేశంలో కూర్చుని ధ్యానం చేసుకోవడం మంచిది. బాహ్య శబ్దాలకన్నా అంతఃకరణలో సంభవించే అలజడి సాధనకి ఎక్కువ అంతరాయంగా వుంటుంది. కాబట్టి నిర్మలాంతఃకరణం సాధన ఫలించడానికి చాలా అవసరము. ఏమంటావు మూర్తీజీ?" అన్నారు.

శ్రీ మూర్తీజీ మాట్లాడుతూ "వీళ్ళంతా చాలా అదృష్టవంతులు బాబూ" అన్నారు. శ్రీ బాబూజీ మహరాజ్ మాట్లాడుతూ "నీకేమి లోటు వచ్చిందయ్యా! నీ మాతృమూర్తి నీకు లోటు చేస్తోందా? నీ కడుపు నిండటం లేదా? నీ తల్లి నీ ఆకలిని తీర్చలేకపోతోందా?" అని అన్నారు. శ్రీ మూర్తీజీ మాట్లాడుతూ "నాకుఈ జన్మకి లోటులేదు బాబూ" అన్నారు.

శ్రీ బాబూజీ మహరాజ్ మాట్లాడుతూ"అయితే నీ కింకొక జన్మ వుందన్నమాట. అంటే నీ విశ్వాసం చిల్లికుండ. చిల్లికుండతో నీరు తీసుకువెడితే ఏమి లాభం? అది నిలుస్తుందా? కాబట్టి సాధకునికి ముందుగా విశ్వాసం ఉండాలి. దానికి మించిన ధీరత్వం ఉండాలి. నా గురుదేవులుండగా నాకు లోటేమి ఉంది? అనే పరిపూర్ణ విశ్వాసమే నీకు రక్షణ కవచము. సమర్థుడైన సద్గురుమూర్తి తనను ఆశ్రయించిన శిష్యులందరిపైన ప్రేమను సమానంగా వర్షింపచేస్తాడే. ఆయనకి పక్షపాతము ఉండదే. ఆయనకు బంధుమిత్రుల వివక్షతగానీ, కులగోత్ర వివక్షతగానీ వుండదుకదా! ఒక చెట్టు చూడండి పేదవాడికి, ధనవంతుడికి ఎవ్వరికైనా ఒకే రకమైనా ఫలాలను అందజేస్తుంది కదా! సూర్యకాంతి పెద్ద భవనం పైన గానీ, చిన్న పూరిగుడిసె పైన కానీ ఒకేరకంగా వుంటుంది. కదా! అలాగే పంచభూతములన్నీ అవి అందజేసే ఫలితాలని ఏరకమైన వివక్షత లేకుండా

అందజేస్తాయి కదా! అంతేకాదు ఆకలిగొన్న పిల్లవాడి రోదన విన్న కన్నతల్లి ఎక్కడ ఉన్నా, ఎంత పనిలో ఉన్నా తన బిడ్డని నిర్లక్ష్యం చేస్తుందా? పరుగు పరుగున వచ్చి ఆ పిల్లవాని ఆకలి తీర్చదా! మరి ప్రాపంచిక ప్రేమే ఈ విధంగా ఉంటే, సమర్థుడైన గురుమూర్తిని ఆశ్రయించిన గురుబిడ్డ పైన ఆయన ప్రేమ ఎలా వుంటుందో వూహించగల్గుతారా? అయితే అది ఆ గురుబిడ్డపడే ఆవేదనపైన ఆధారపడి ఉంటుంది. అంతేకాదు, ఆ ప్రేమ అందుకునే వాడు గురుబిడ్డ అయిఉండాలి. అది చాలదు, వాడు బాగా ఆకలిగొన్నవాడై ఉండాలి" అన్నారు.

ఇంకా మాట్లాడుతూ, "ఇక్కడ మీకొక దృష్టాంతము చెబుతాను. నచికేతుడు తీవ్రమైన ఆవేదనతో ఆత్మజ్ఞానాన్ని పొందాలనే ఆకాంక్షతో యమధర్మరాజును పరిపూర్ణ విశ్వాసంతో సద్గురుమూర్తిగా ఆశ్రయించినపుడు యమధర్మరాజు బోధచేస్తూ ఆత్మ సాక్షాత్కారానికి గురుసాన్నిధ్యము అవసరమే. దాని ద్వారా నిరంతరము గురుబోధా శ్రవణము చేయటానికి సదవకాశము కలిగే మాట యథార్థమే కానీ సాధకుడి కృతార్థతకు అది చాలదు. బాహ్యసాధనతోపాటు మానసిక సాధన కూడా కావాలి అంటాడు. ధ్యానమునకు కూర్చోవచ్చు. మనస్సును బాహ్యశబ్దముల నుండి నిగ్రహించవచ్చు. కానీ ఆ మనస్సు అంతర్ముఖమవ్వాలి. అది స్థిరపడాలి. నిశ్చలస్థితిని పొందాలి. దీనిని సాధించడానికి గురుమూర్తి బోధను శ్రవణం చేసి దానిని అనుభవంలోనికి తెచ్చుకున్నప్పుడే మనోనిగ్రహం సాధించగల్గుతారు. దీనిని ఆటంకపరచే ముఖ్యమైన అవరోధాలు అహంకారము, మోహము, ఆశ. శ్రీ కృష్ణ పరమాత్ముడు ఎంత బోధచేసినా అర్జునుడు మోహాన్ని జయించగల్గాడా! గురుబోధాశ్రవణం చేయగా చేయగా అది మననానికి వస్తుంది. అహంకారము, మోహము, ఆశ అనేవి మనస్సుని ఆవరించి ఉంటాయి. సాధకుడు నెమ్మది నెమ్మదిగా మనస్సని స్వాధీనపరచుకోవాలి. మనోవృత్తి రహితమైన మరుక్షణం శాంతి చేకూరుతుంది. గురుదేవుని పాదం పట్టినా మనస్సు లక్ష్యార్థం పైన నిలువకుండా అటు ఇటు పరుగులెత్తటం చేతనే సంకల్ప వికల్పాలు కల్గుతున్నాయి. మనస్సుని గురు లక్ష్యార్థంపైన నిలపటానికి తీవ్రప్రయత్నం చేయాలి. ఆవేదన చెందాలి. మనస్సు నిలిచినా నిలవకపోయినా ధ్యానం మానకూడదు. ప్రయత్నం చేయవలసిందే. నీ ఆవేదనని అర్థం చేసుకోలేడా నీ గురుదేవుడు?" అన్నారు.

(గత సంచిక తరువాయి) **అమ్మ మాట** - జపమాల ప్రసాద

## ఆనందో బ్రహ్మ

భగవద్భక్తులు మనకు మార్గదర్శకులు. వారు ఆచరించి, మనకు చూపించారు. వారు నిరంతరం భగవన్నామ స్మరణ చేస్తూ, భగవద్భక్తిని ప్రచారం చేస్తూ, సత్సంగం చేసుకుంటూ, భక్తసమారాధనలు చేసేవారు. వారు యేనాడు కూడా తమకిష్టమైన వంటకాలు చేసుకుని, ఫ్రిజ్‌లో దాచుకుని తినలేదు. సోమరితనాన్ని దరికి రానీయలేదు. సోమరి అవకు. నీకు కావలసినది వండుకుని తిను. నీకు వున్నంతలో యితరులకి పెట్టు. నీకిష్టమైన వంటకాలు చేసుకుని, ఫ్రిజ్‌లో దాచుకుని నీవు ఒక్కడివే తినకు. ఇదే మహాత్ముల బోధ.

అది మన మహాభాగ్యం. మన పూర్వీకులు యిచ్చే భోగభాగ్యాలు కేవలం యెంగిలి అయినవి. వారందరూ అనుభవించగా మిగిలిపోయిన, అశ్వరమైన సంపదలు అవి. అందరూ యేరుకుని పారేసిన వంకాయల వంటవి. మన గురుదేవులు మనకు శాశ్వతమైన, తరగని పెన్నిధిని ప్రసాదించారు. అదే భగవన్నామం. "నీకు కావలసినది సంపాదించు. కానీ దానిని సద్వినియోగం చేసుకో" అన్నారు శ్రీబాబు.

ఆనాడు శ్రీరామచంద్రుడు ఒక చక్రవర్తి కుమారుడై వుండి కూడా విద్యాభ్యాసానికై గురుకులానికి వెళ్ళినప్పుడు ఆయన తన తమ్ముళ్ళను కూడా పాదరక్షలు కూడా లేకుండా సంచరించారు. రాముడు కూడా చీపురు పట్టుకుని తుడిచాడు. గుంటలు తవ్వాడు. అంతేకాదు పిల్లలందరూ బెంగ పెట్టుకుంటే, తానే ఒక్కొక్కరికి తల్లి అయి జోలపాడి నిద్రపుచ్చాడు. ఇదంతా చూసిన అరుంధతీ దేవి మాతృ హృదయం తల్లడిల్లిపోయి యిదెక్కడి న్యాయమని వశిష్ఠులవారిని అడిగితే, ఆయన "దేవీ! ఇది వారి భవిష్యత్ కోసం యిస్తున్న శిక్షణ" అన్నారు.

మీరు కూడా ఒక్కసారి ఆ సన్నివేశాన్ని మీ మనస్సులో

ఊహించండి. రాముడు తన ఒడిలో పిల్లల తలను పెట్టుకుని జోల పాడాడు. అది మనమే కదా. ఆయనే కదా మన కష్టాలన్నిటినీ తీరుస్తూ మనకు కావలసినవి అన్నీ అందిస్తూ సేద తీరుస్తున్నారు. ఎవరి స్వధర్మాన్ని వారు ఆచరించవచ్చు. కాని అదే పనిగా దానిని అంటిపెట్టుకుంటే అది మనని ముంచేస్తుంది. త్రాడు తెగేంతవరకు లాగకూడదు. ఏది యెంత వరకో అంతవరకే వుంచాలి. దీనికి మీకొక చిన్న కథ చెబుతాను. ఒకసారి యిద్దరు బాటసారులు కలిసి ప్రయాణం చేస్తుండగా దారిలో ఒక నది దగ్గరకు వచ్చారు. ఆ నదీ ప్రవాహంలో ఒక నల్లని మూట కొట్టుకుపోతున్నది. దానిని పట్టుకుందామని ఒకడు నదిలోకి దూకాడు. అతడు ఎంతసేపటికీ బయటకి రాకపోయేసరికి రెండవవాడు 'ఎందుకు రావటం లేద'ని అడుగుతాడు. అప్పుడా మొదటివాడు 'ఆ మూట నన్ను పట్టుకుని వదలటం లేదు' అంటాడు. ఇంతకీ ఆ మూట యేమిటనుకున్నారు? అది ఒక యెలుగుబంటి. మనలో వున్న ఆశాపాశములనే యెలుగుబంటిని మనం ఒక్కసారి పట్టుకుంటే చాలు. అది మనల్ని మ్రింగేస్తుంది.

ఇంతకీ యెవరు, యెవరిని పట్టుకున్నట్లు? సంసారాన్ని నువ్వు పట్టుకున్నావా? సంసారం నిన్ను పట్టుకుందా? దీనికి కూడా మనకి కోతి పప్పుల కుండ కథ వుంది కదా. ఇది పురస్కరించుకునే శ్రీ గురుదేవులు మనకు విశాఖపట్నంలో ఒక కీర్తన యిచ్చారు.......

1. మమకారములో పడకుమురా
మాధవుని తలపరా జీవా!
భార్యాపుత్రుల బంధుమిత్రుల
మమకారములు మాయలేరా!
మరువకురా మాధవుని పదములు మదిలో సదా నిలుపరా!

2. అది నాది, ఇది నాదని విర్రవీగెదవు జీవా!
ఏదీ నీది కాదురా
నేనూ నాదీ దూరమైనప్పుడే
నీవు నీవుగా నిలిచెదవురా!

ఇది నిజమురా! ఇదే సత్యమురా!

3. కామ క్రోధ మద లోభ మోహములు
కానరాక నిన్ను కబళించును రా!
కాంచలేవురా సత్యమార్గమును
గురుచరణములే నిన్ను రక్షించును ॥మమ॥

మనం యే పనైనా చేయాలంటే 'మూడ్' లేదంటాం. వ్రాయాలన్నా, చెప్పాలన్నా, పాడాలన్నా మూడ్ లేదని అంటూవుంటాం. మరి భోజనం చేయటానికి అలా అనమే?

శ్రీగురుదేవులు యీ కీర్తనను వారు పాడుతూ వుంటే, ఒక గురుసోదరుడు పుస్తకంలో వ్రాశారు. నిరంతరం భగవన్నామంలో, భగవతత్వ విచారణలో ఓలలాడేవారు కనుక వారికి అప్పుడు, ఇప్పుడు అని యేముంది? వారి ముఖస్తుగా తత్వం తప్ప వేరే యేమి వస్తుంది? మన ధ్యానానికి యీ ముద్ర చాలదా?

అన్నింటి మధ్య వుండాలి. అన్నీ చేయవచ్చు. కానీ మమకారం చెందకూడదు. ఏ చీరమీదో, గారె మీదో మమకారం చెందకూడదు. దానిని విచారణతో, వివేక దృష్టితో యేరిపారేయాలి. భగవన్నామంలోనే మనస్సును ఊరవేయాలి. శ్రీగురుదేవులు మనకి చక్కని ఆశ్రమాన్ని ప్రసాదించారు. అన్నీ అమర్చారు. ఏలోటూ లేదు. హాయిగా, నిశ్చింతగా, సాధన చేసుకోవటానికి చక్కటి వాతావరణాన్ని కల్పించారు. అయినా కూడా మనస్సులు యిటూ అటూ పోతూ వెలితిపడుతున్నాయంటే అది ఎవరి తప్పు? లోపమెక్కడుంది? అదే పూర్వవాసనల బలం. దానిని అధిగమించాలంటే శ్రీగురుదేవులు ప్రసాదించిన లక్ష్యార్థ ధ్యానం, స్మరణమే గతి. అటువంటి సాధన సంపత్తిని, అఖండ భక్తి జ్ఞాన వైరాగ్యాలను ప్రసాదించి గురుపాదుకలు సర్వదా మనను కాపాడుగాక! సుఖీభవ! సుఖీభవ!!

# బంగారు క్షణాలు

- డా॥ స్వర్ణముఖి

(గత సంచిక తరువాయి)

శ్రీబాబు - ఇది కఠోపనిషత్తులో నచికేతునికి అతని గురుదేవులయిన యమధర్మరాజు ఆ విధంగా బోధ చేశారు. అసలు కథమేమిటంటే నచికేతునికి గురుదేవుడు యమధర్మరాజు. అతను తన గురుమూర్తిని తనకు శాశ్వత సుఖానందాలిచ్చేటటువంటి మార్గమును బోధించమని అంటాడు. అప్పుడు యమధర్మరాజు అతనిని పరీక్షించగోరి "నాయనా! నీకెందుకు ఇవన్నీను. నీకు స్వర్గసుఖాలనిస్తాను. హాయిగా అనుభవించు' అంటాడు. అది విని నచికేతుడు 'స్వామీ! ఈ రాజ్యసుఖాలు, స్వర్గ సుఖాలు శాశ్వతమా? ఎన్నాళ్ళుంటాయి' అని అడిగాడు. అది విని, యమధర్మరాజు నోరావలించాడు! మళ్ళీ తిరిగి, నాయనా! నీకు వెలలేనటువంటి నీలమణులను యిస్తాను' అంటాడు. నచికేతుడు 'స్వామీ! రత్నాలను నేనేం చేసుకోను? అవి శాశ్వతమా? వాటిని పొడిచేసుకుని నా కడుపులో దాచుకోనా? అవి నాకు నిత్యానందాన్ని యిస్తాయా?' అని అడిగాడు. యముడు యిది విని, 'సమాధానమీయ లేక మళ్ళీ నోరు ఆవలించాడు! ఇంకేమీ తోచక యమధర్మరాజు 'నాయనా! నీకు నూరేండ్లు బ్రతికి వుండే కొడుకులను, మనవలను, యేనుగులను, గుఱ్ఱాలను, బంగారాన్ని ఏదికావాలంటే అది యిస్తాను కోరుకో. నీకు యిష్టమైనంతకాలం నువ్వు జీవించు' అంటాడు. అప్పుడు నచికేతుడు 'చనిపోయిన తరువాత ఏమి జరుగుతుంది? చచ్చిపోయాక మానవుడు వున్నాడని కొందరు, లేడని కొందరు అంటున్నారు. అందుకని యీ మరణం అంటే ఏమిటో అసలు రహస్యం తెలుసుకుందామని సాక్షాత్ మృత్యుదేవత అయిన నీ దగ్గరకు వస్తే, యివన్నీ యిస్తాను అంటావేమిటయ్యా? నువ్వు యిస్తానన్నవన్నీ ఒకనాడు కాకపోతే, మరొక నాడైనా పోయేవే కదా! ఈ దేహం కూడా పోకుండా శాశ్వతంగా వుండదు కదా! పోనీ నువ్వు వచ్చి నా ప్రాణాలు తీసుకు వెళ్ళిపోకుండా వుంటావా? వెయ్యి యేళ్ళు తరువాతయినా వచ్చి నన్ను తీసుకుపోతావు. నిజం చెప్పు. నన్ను తీసుకు వెళ్ళకుండా వుంటావా?' అని అడుగుతాడు. యముడు సమాధానమీయలేక మళ్ళీ నోరావలించాడు! 'అమ్మో! వీడి ప్రశ్నలన్నిటికి నేను జవాబిస్తే నేనూ, నా ఉద్యోగం మానుకోవలసి వుంటుందేమో!' అనుకున్నాడట యమధర్మరాజు. కానీ ఆయన ఆ చిన్న

బాలుని పట్టుదలకెంతో సంతోషించి, 'ఆహా! ఇతడు నిజంగా గట్టివాడు. నేను యెంత మభ్యపెట్టాలని చూసినా లొంగలేదు. రాజ్యసుఖాలు, స్వర్గ సుఖాలు, ధనైశ్వర్యాలు, దేహము యివేవీ కూడా శాశ్వతం కావని తెలుసుకున్నవాడు యీ చిన్నబాలుడు. (అతనికప్పుడు అయిదేండ్లు లేదా యేడేండ్లో! వయస్సుతో నిమిత్తమేమిటి జ్ఞానానికి). ఈ అబ్బాయి తప్పకుండా ఆత్మవిద్యను అభ్యసించటానికి అర్హుడు. ఇటువంటి దృఢ సంకల్పంగల శిష్యుడు ఒక్కడు దొరకినా చాలు. ఏ గురువు సంతోషించడు?' అని ఆయన మహదానందంతో నచికేతుడికి ఆత్మవిద్యను బోధిస్తాడు. అటువంటి దృఢమైన వైరాగ్యము, పట్టుదల కావాలి సాధకుడికి.

ఇప్పుడు నువ్వు యింకొటి చెప్పమ్మా! అన్నారు. (శేషమ్మగారిని)

శేషమ్మగారు - అల్పుడెప్పుడు పల్కు ఆడంబరముగాను
సజ్జనుండు పల్కు చల్లగాను
కంచు మ్రోగునట్లు కనకంబు మ్రోగునా?
విశ్వదాభిరామ! వినురవేమ!

శ్రీబాబు - అల్పుడైనవాడు ఎప్పుడూ కూడా, ఆడంబరంగానే మాట్లాడతాడు. తనకన్నీ వచ్చునని గొప్పలు చెప్పుకుంటూ వుంటాడు. కాని సజ్జనుడైన వాని వాక్కు యెప్పుడూ కూడా చల్లగా మృదువుగా, వినయంగా, యెవరికి కూడా నొప్పి కలిగించకుండా వుంటుంది. కంచుచెంబు, క్రింద పడితే ఖంగుమని శబ్దం చేస్తుంది. కాని బంగారు పాత్ర క్రిందపడితే యేమీ పెద్ద శబ్దం రాదు. అలాగే యేమీ తెలియని మూర్ఖుడు, తనకన్నీ తెలుసున్నట్లుగా డాంబికంగా యెగిరి యెగిరి పడతాడు. జ్ఞానియైన వాడు తనకన్నీ తెలిసి వున్నా కూడా తొణకడు, బెణకడు. నేను యింతటి వాడను, అంతటివాడనని ఎడ్వర్‌టైజ్‌మెంట్ చేసుకోడు. అన్నీ తెలిసి వుండి కూడా యేమీ తెలియనట్లుగానే సామాన్య మానవుడిలాగానే వుంటాడు. నిర్మల గాంభీర్య హృదయుడై అందరికీ ఆనందాన్ని పంచిపెడతాడు. చూడండి ఖాళీ విస్తరయితే యెగిరిపడుతుంది. నిండుగా వడ్డించిన విస్తరి యెగురుతుందా? నిండుకుండ తొణకదు. అదీ దుర్జనుడికి, సజ్జనుడికి మధ్య తేడా. అజ్ఞానికి, జ్ఞానికి తేడా అటువంటిది. కంచు కనకానికి మధ్య వున్నంత తేడా. ఇది ఎంతో మంచి ఉదాహరణ. ఇంత చిన్న పద్యములో వేమనగారు యెంతటి తత్వాన్ని నిరూపించాడు!

- సశేషం

# సన్నిధిలో సంభాషణ

(గత సంచిక తరువాయి) - పరాశర ప్రసాద్

28.12.85

శ్రీబాబు భక్తులనుద్దేశించి మాట్లాడుతూ ''ఏమండీ జోగారావుగారూ! జీవాత్మ పరమాత్మ అనేవి భిన్నమైనవా లేక రెండూ ఒకటేనా? ఎంతైనా మీరు పండితులు మీరు చెపితే విందామని" అన్నారు. శ్రీరావుగారు మాట్లాడుతూ 'మీరు మమ్మల్ని మాయలో పడేస్తున్నారు' అన్నారు. శ్రీబాబు మాట్లాడుతూ "నేను మిమ్మల్ని మాయలో పడవేయ గలనాండి? నేను మీకు దాసానుదాసుడిని. ఒక ఘటము ఉందనుకోండి. దాని లోపల ఆకాశం వుంటుంది. దానిని ఘటాకాశం అంటారు. దాని వెలుపల ఉండే ఆకాశాన్ని మహాకాశము అంటారు. ఇప్పుడు ఘటము చిట్లితే ఘటము లోపలి ఘటాకాశము ఘటము వెలుపలి మహాకాశములో లీనం అయిపోతుంది. అలాగే జీవుడు అనే ఘటము చిట్లినపుడు జీవాత్మ అనే ఘటాకాశము పరమాత్మ అనే మహాకాశములో లీనమయిపోతుంది. ఇప్పుడు



చెప్పండి? జీవాత్మ పరమాత్మ అనేవి భిన్నంగా ఉన్నాయా? మానవుడు ఈ దేహం నేను అనే భ్రాంతిలో పడి దారాపుత్రుల వ్యామోహంలో పడి మారని వస్తువుని మరచి మారిపోయేదాన్ని ప్రేమిస్తున్నాడు. ఎందుకురా గొర్రెపోతేలుకి మల్లే మీసాలు? మూడు గుణాల్ని జయించి అవతలనున్న ముక్తికాంతను పొంది అప్పుడు ధీరుడవయి పెంచు అంటే వింటారాండీ? మీలాంటి చదువుకున్న వాళ్ళంతా కలసి ఇదేదో న్యూసెన్స్‌లో నాన్సెన్స్‌లా ఉందంటారు.

కబీర్‌దాస్ లాటివారు 'మానవజన్మకి వచ్చింది హాయిగా తిని నిదురించటానికి కాదురా, మనసారా ఆ రామనామాన్ని ఒక్కసారి స్మరించరా' అంటే వింటారా? 'హీనుడు అవ గుణంబు మానునా?' 'బొగ్గు పాల కడుగ పోవునా మలినంబు?' అన్నట్లుగా అశాశ్వతమైన దేహాన్నే నమ్ముకుని ఉంటారు. చివరికి ఒట్టి చేతులతో మట్టిపాలవుతారు. ఆత్మ వీడిన దేహాన్ని ఏమంటారు? ప్రేత అంటారు. అది ఏమంటుంది 'తద్దివిట తద్దివిట' అంటూ తల క్రిందికీ పైకీ ఊగుతుంది. 'దేహ భ్రాంతిలో ఉన్నావంటే నువ్వూ ఇంతే. ఎంత సంపాదించినా ఇంతే. ఎంత దారాపుత్రాదులను ప్రేమించినా ఇంతే. వ్యాపారంలో ఎంత సంపాదించినా ఇంతే' అని హెచ్చరిస్తుంది ఆ ప్రేత. ఆ క్షణంలో మాత్రం కొంతమదికి వైరాగ్యం కలగవచ్చు. ఎవరైనా ఇంతేకదా? ఎప్పటికైనా ఇంతే కదా?' అని అంటారు. దానినే శ్మశాన

వైరాగ్యము అంటారు. అది కూడా అశాశ్వతమైనదే. శ్మశానము నుండి ఇంటికి రాగానే మళ్ళీ మామూలే. ఒక వస్తువుని కంటికి వ్రేలు అడ్డం పెట్టుకుని చూస్తే రెండుగా గోచరిస్తుంది. ఆ దోషము వస్తువులో లేదు కదా! పోనీ కంటిలో ఉందా అంటే అదీ లేదు. ఉన్న దోషమల్లా దృష్టిలోనే ఉంది. నదిలో మధ్యగా ఏదైనా అడ్డు ఉంటే నది రెండుగా చీలినట్లు గోచరిస్తుంది. యథార్థమైన దానిని దృష్టిదోషం వలన భిన్నంగా భావిస్తున్నాడు.

దీనికి మీకు ఇంకొక దృష్టాంతము చెపుతాను. మానవుడు సర్వ ప్రకృతికి దాసానుదాసుడు కదా! ఎవరి ద్వారానైనా ఏదైనా తనకి లాభం చేకూరుతుంది అంటే వారికి తలవంచి నమస్కరిస్తాడు కదా! అవసరం అయితే సాష్టాంగ నమస్కారము కూడా చేయటానికి వెనుదీయడు. అవసరం అనుకుంటే పదిమందితో రికమండేషన్ చేయిస్తాడు. ఇంతమందిని ఇన్ని విధాలుగా ప్రాధేయపడి వేడుకొనే బదులు భగవంతుడిని వేడుకుంటే చాలదాండీ! భగవంతుని కృపకి పాత్రుడయితే, ఎవరి ద్వారా తన పని సఫలమవుతుందో వారికి భగవంతుడు సద్బుద్ధిని కలగజేస్తాడు. ఇంక లోటేముంది? అప్పుడు కూడా మానవుడు అవివేకుడై తనకి సహాయపడినది భగవంతుడని ఎన్నడూ తలచడు. దానికి కారణం ఏమిటి? నీలో ఉండే 'నాది నేను' అనే భావనే. అదే నానాత్వము. అది దేహభ్రాంతిని కలగజేస్తుంది. దేహభ్రాంతి అన్నా, జీవభ్రాంతి అన్నా ఒకటే. అది ఎప్పుడైతే తొలగిపోతుందో అప్పుడు ద్వైతము హరించి అద్వైతము స్థాపించబడుతుంది. జీవుడు అహంకార మమకారములతో కూడిన దృష్టితో చూస్తే ఏ వస్తువైనా రెండుగా గోచరిస్తుంది. కాబట్టి తన దృష్టిలో ఉన్న దోషాన్ని తొలగించుకుంటే తనలోను సర్వసృష్టిలోను ప్రకాశించే పరమాత్మ ఒక్కడేనని తెలుసుకుంటాడు. అప్పుడు జీవాత్మ వేరు పరమాత్మ వేరు అన్న ద్వైతభావన ఉంటుందా? గోవర్ధనగిరి పర్వతాన్ని తన చిటికెన వేలుతో ఎత్తిన గిరిధర గోపాలుడు ఎవరో మీరా తెలుసుకోగలిగింది కాని పాండిత్యానికి, శాస్త్రానికి అందుతాడా ఆ గోపాలబాలుడు. కృష్ణుని వయస్సు అప్పుడు ఎంత? ఆరు సంవత్సరాలేగా! అర్థం చేసుకునే వారికి చాలా అందుతుంది. ఆ సంఘటనలో రెండు అర్థాలు ఉన్నాయి. నన్ను ఆశ్రయించిన వారిలో పాతుకుపోయి ఉన్న గోవర్ధన గిరి పర్వతం లాంటి ఆరు గుణాలని చిటికిన వేలుతో తొలగించి వ్రేపల్లె వాసులు పొందిన స్థితిని అందజేస్తాననేది ఒక భావన. పంచమహాభూతాలైన పృథ్వి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము అన్నీ ఆయన ఆధీనములోనే ఉన్నాయి కాబట్టి ఆయనతో కూడి మొత్తము ఆరు అనేది రెండవ భావన. ఇందులో మీరు ఎలా కావాలంటే అలా అర్థం చేసుకోవచ్చు. కాబట్టి మీరు మీరా అంతటి స్థితిని పొందాలని ఈబాబు ఆకాంక్ష" అన్నారు.

# పరమ పూజ్య శ్రీ విద్యా స్వరూపానందగిరి స్వామివారి ప్రవచనం

(గత సంచిక తరువాయి) సేకరణ - రమణ ప్రసాద్

దేవుడు లేని చోటు లేదు. అది చైతన్యం. ఈ ఫ్యాను, మైకు జడాలు. కరెంట్ ఉంటే కాని అవి పని చెయ్యవు. అలానే చైతన్య స్వరూపమైన పరమాత్మను తెలుసుకోవాలంటే సాధన చేయాలి. ఉత్తరారణి, అధరారణి అనే కట్టెలను కవ్వంగా చేసి మథించగా వచ్చిన నిప్పుతో యజ్ఞ, యాగాదులు చేస్తారు. మరి కట్టెలలో నిప్పు ఉంది కదా! అది కట్టెలను కాల్చిందా? 'మావి చేత గర్భమందలి శిశువు కప్పబడినట్లు అజ్ఞానం జ్ఞానాన్ని కప్పివేసింది' అని భగవద్గీత చెప్తోంది. అదే విధంగా పాలను తోడు పెట్టి మథిస్తే వెన్న ఎలా



వస్తుందో, అలాగే అంతటా ఉన్న భగవంతుడు పరిశ్రమిస్తే కనిపిస్తాడు. 'వెదికి చూడు - కనిపిస్తాడు' అని ప్రహ్లాదుడు తండ్రికి చెప్పాడు.

అది సత్తు, చిత్తు, ఆనంద స్వరూపమైన వస్తువు. దానిని బ్రహ్మ అనండి, ఆత్మ అనండి, భగవంతుడు అనండి. ఆయనకు ఒక కోర్కె కలిగింది. బహుశ్యాం ప్రజాయేతి- ఆ సంకల్పం వల్ల సృష్టి వచ్చింది. ఎలా వచ్చింది? అంటే సాలె పురుగు ఎలా తనలోనించి దారం తీసి తానే వేసుకుంటుందో, అలా ఈ రూపాత్మకమైనఈ సృష్టి పరమాత్మ యొక్క సంకల్పం చేత వచ్చింది.

కుమ్మరి మట్టితో కుండలు, పిడతలు, ప్రమిదలు చేస్తాడు. రూపాలు వేరైనా వాటికి ఆధారం మట్టే కదా! వాటిలోనించి మట్టి తీసేస్తే? వాటికి నామ రూపాలు ఉన్నాయా? ఒక అబ్బాయికి పెళ్ళి సంబంధం కుదిరింది. నగలు చేయించాలి. వాళ్ళింట్లో పాత కాలపు నగలు ఉన్నాయి. వాటిని మార్చి కొత్త డిజైన్లలో నెక్లస్సులు, గొలుసులు, గాజులు చేయించారు. వీటిల్లో ఉన్నది ఒకే బంగారం కదా! బంగారం తీసేస్తే? ఇవేవీ లేవు. అలాగే ఈ నామరూపాత్మకమైన జగత్తు చైతన్యం నుంచి వచ్చింది. చైతన్యం తీసేస్తే? దానికి ఉనికే లేదు.

మనం చెప్పుకున్నట్లు మట్టితో చేసినవి మట్టిగా, బంగారుతో చేసినవి బంగారుగా ఉన్నట్లు, బ్రహ్మ నుంచి వచ్చిన సృష్టి ఎన్ని రకాలుగా ఉన్నా బ్రహ్మమే. మిగిలిన కల్పితాలు హుళక్కే. రమణ మహర్షుల వారు ఒక అద్భుతమైన

వుదాహరణ ఇచ్చారు. సినిమా మొదలవక ముందు ఎదురుగా తెల్లటి స్క్రీన్ (పర్దా) ఉన్నది. లైట్లు ఆర్పివేసి స్విచ్ వేశాడు. తెర మీద రకరకాలైన దృశ్యాలు వచ్చాయి. దేవతలు వచ్చారు. రాక్షసులు వచ్చారు. అప్సరసలు నృత్యాలు చేశారు. ఇవి సత్యం కాదని నీకు తెలుసు. కాని పిల్లవాడు! సినిమాలో దయ్యాన్ని చూసి నిజమనుకొని భయపడ్డాడు. జ్వరం కూడా వచ్చింది. దేనివల్ల? అజ్ఞానం వల్ల. అది తెలిసినవాడు వచ్చి'ఒరేయ్! ఇది సినిమా రా. ఫిల్మ్ మీద లైట్ పడి ఈ దృశ్యాలు వచ్చాయి.' అని చెప్తాడు. అప్పుడు భయం పోతుంది.

ఉన్నది పరబ్రహ్మమే. ఒకే ఉనికి. రెండు ఉనికిలు ఉండవు. అది త్రికాలాభాధ్యం. అపరిచ్ఛిన్నం. ఆ పరమాత్మనుంచే సృష్టి వచ్చింది అని తెలుసుకున్నాం. అస్తి, భాతి, ప్రియం, నామ రూప ఇతి పంచకం- ఈ కనపించే వస్తువులకు ఐదు లక్షణాలు. ఉనికి, ప్రకాశం, ఆనందం - ఇవి పరమాత్మ రూపాలు. నామరూపాలు జగత్తు యొక్క లక్షణాలు. జగత్తు గతి శీలం. ఒకే చోట, ఒకే విధంగా ఉండదు. పరిణామం దాని లక్షణం. నామ రూప జగత్తు సత్యం కాదు. పరమాత్మ ఒక్కటే సత్యం. అటువంటి పరమాత్మ నుండి సృష్టి వచ్చింది. కంసాలి బంగారాన్ని కరిగించి నగలు చేశాడు. బంగారం ఉపాదాన కారణం. కంసాలి నిమిత్త కారణం. ఈ నామ రూపాలు కొంత కాలం ఉంటున్నాయి, పోతున్నాయి. మళ్లీ ఇంకొక రూపంలో వస్తున్నాయి. వీటికి ఆధారమైనది పరమాత్మ. దానినే బ్రహ్మ అన్నారు. ఇది మారనటువంటిది.

మండన మిశ్రులవారు ఈ జగత్తు లేదన్నారు. కాని పద్మ పాదాచార్యులవారు లేదని ఎలా చెప్తావు? నువ్వు ఉంటున్నావు, తింటున్నావు కదా! లేదు అని ఎలా చెప్తావు? ఇవి ఉన్నాయి, కాని కల్పితాలుగా ఉన్నాయి అని ఆయన అన్నారు. దాని పేరే మాయ' అన్నారు రమణ మహర్షి. ఇవి త్రికాలాభాధ్యం. యన్నాదౌ నాస్త్యంతే - మొదలు లేదు. చివర లేదు. మధ్యలో వున్నది. గంధర్వ నగరం, కుందేలు కొమ్ములా అసలు లేకపోవటం లేదు. మరి వ్యవహారం చేస్తున్నావు కనుక దానిని వ్యావహారిక సత్తా అని అన్నారు.

'తెరమీద బొమ్మలు పడుతున్నాయి. వాటని చూసి ఆనంద పడుతున్నావు. కాని నిజంగా ఉన్నాయా? ఉన్నాయి. పిల్లవాడు సినిమాలో దయ్యాన్ని చూసి భయపడతాడు. కాని ఇది సినిమా అని తెలిసినవాడు తెరమీద కనిపించేవి నిజంకాదు అంటాడు. అదే విధంగా ఉన్నది బ్రహ్మ పదార్థం ఒకటే.ఈ వ్యవహారిక జగత్తు కల్పన మాత్రమే అని తెలుసుకున్నవాడు ఆనందం పొందుతున్నాడు. అది తెలియనివాడు దుఃఖాన్ని పొందుతున్నాడు. అది తెలుసుకోవటమే జ్ఞానం. అందుకొరకు గురువును ఆశ్రయించాలి. యోగవాసిష్టంలో చూడాల- శిఖిధ్వజు వృత్తాంతంలో చూడాల శిఖిధ్వజుని

భార్య. అతడు రాజ్య పరిపాలనతో విసుగు చెంది తపస్సుచేయటానికి  అడవికి వెళ్తాడు.చూడాల రాజ్యభారం వహిస్తుంది. శిఖిధ్వజుని పరీక్షించటానికి ఋషి రూపం ధరించి, 'మీకు శాంతి లభించిందా?' అని అడుగుతుంది. నా మనస్సు నా రాజ్యం, నా భార్య మీదకి పోతోంది.' అంటాడు. ' మీరు అన్నీ త్యాగం చేశారు. కాని మీకు శాంతి లభించ లేదు' అంటుంది. అప్పుడు కుటీరం తగుల బెట్టాడు. అయినా శాంతి లభించలేదు. చూడాల, ' పిచ్చివాడా! ఇవి కాదు నువ్వు త్యాగం చేయాల్సింది. ఇవన్నీ పంచభూతాల వల్ల ఏర్పడినవి. నీ మనస్సులో ఉన్న వాటిని త్యాగం చెయ్యి. జడమైన వస్తువులను నిజమని  భ్రమ పడ్డావు. నువ్వు సాధన చెయ్యి' అని ఉపదేశం చేస్తుంది. అతడు శాంతిని పొందాడు.

శాంతి, ఆనందం పరమాత్మ లక్షణాలు.  దాన్ని గుర్తించక నామ రూపమైన జగత్తును  ఆరోపించుకొని  సుఖ దుఃఖాలు అనుభవిస్తున్నాడు. ఇవి మనో ధర్మాలు. ఆకలి దప్పులు ప్రాణ ధర్మాలు.సత్తు, చిత్తు, ఆనందం ఆత్మ లక్షణం. ఇది ఎప్పటికీ ఉండేది. నామ రూపాలు మారినా బంగారం బంగారం గానే ఉంటుంది. అలాగుననే  పరబ్రహ్మం ఎప్పుడూ పోని మౌలిక పదార్థం. నామరూపాలు కల్పితమైనవి. ఇవి నిమిత్త కారణాలు. వీటిని నేతి, నేతి అని తీసివేయాలి. ఉల్లిపాయ పొరలు తీసేస్తే ఏది మిగులుతుందో అదే పరమాత్మ. దీనిని అవగాహన చేసుకోవాలంటే గురువును ఆశ్రయించాలి. అజ్ఞానమనే ఆవరణను తీసివేయాలి. ఉన్నదానిని ఉన్నట్లు తెలుసుకోవటమే జ్ఞానం. త్రాడును పాము అనుకుని భ్రమ పడ్డావు అదే అజ్ఞానం. పిల్లవాడు అక్కడ పాము ఉన్నా భయపడతాడా? వాడికి అది పాము అని తెలియదు.  శాస్త్రాలను సరిగ్గా అవగాహన చేసుకోవాలంటే గురువును ఆశ్రయించాలి. సగురమేవాభి గచ్ఛేత్ సమిత్పాణిః.- సృష్టిని మార్చలేవు, నీ దృష్టిని మార్చుకో - దృష్టి జ్ఞానమయీం కృత్వా పశ్యేత్ బ్రహ్మ మయం  జగత్ - అన్నారు శ్రీ పద్మపాదాచార్యులవారు.
నీ మనస్సు నిర్మలం చేసుకో. అప్పుడు గురువుగారు చెప్పగానే మల,విక్షేప ఆవరణ దోషాలు  పోతాయి. అనుభవం మిగులుతుంది. ఉప్పును నీళ్ళలో కలిపావు.  ఉప్పు నీళ్ళలో కలిసిపోయి ఏకరూపం పొందింది. ఎవరైతే గురువు ద్వారా తత్త్వ జ్ఞానోపదేశం చేసుకుంటాడో, వాడు ఈ నామ రూపాత్మకమైన జగత్తును బ్రహ్మగానే చూస్తాడు. అటువంటి సమర్థులైన గురువు మీకు లభించాడు మీ జీవితాలను సార్థకం చేసుకున్నారు. ఆ సార్థకత్వాన్ని మీరు అనుభవింతురు గాక! హరిః ఓం!

## పరమ పూజ్య శ్రీ దండి నిర్మలానందగిరి స్వామివారి ప్రవచనం

(గత సంచిక తరువాయి) సేకరణ - రమణ ప్రసాద్

అందువలననే దేహవాసన తొలగాలి. దేహ వాసన తొలిగితే, లోక వాసన, శాస్త్ర వాసన తొలగి పోతాయి.

వ్యక్తి నడత బాగా ఉంటేనే సమాజం బాగుంటుంది. భక్తి రెండు విధాలు. సగుణ భక్తి, నిర్గుణ భక్తి. ప్రహ్లాదుడిలో రెండూ ఉన్నాయి. ప్రహ్లాదుడు రాక్షస బాలుడు. తల్లి కడుపులో ఉండగానే నారదుడు తన తల్లికి చెప్తున్న తత్త్వాన్ని ఆలకించాడు. 'ఓం నమో నారాయణాయ' మంత్రాన్ని పొందాడు అందువలన నారదులవారే ఆయనకు గురువైనారు. తండ్రి హిరణ్య కసిపుడు విద్యాభ్యాసానికి చండామార్కుల వద్దకు పంపాడు. ఒకసారి ప్రహ్లాదుని గురువు తండ్రి వద్దకు తీసుకురాగా, 'నాయనా! నీవు తెలుసుకొన్న అంశముల సారమును నాకు చెప్పుమ'నగా, తండ్రీ!



చదివించిరి నను గురువులు
చదివితి ధర్మార్థముఖ్యశాస్త్రంబులు నేఁ
జదివినవి గలవు పెక్కులు
చదువులలో మర్మమెల్లఁ జదివితిఁ దండ్రీ ॥

చదువులలోని మర్మాలన్నీ చదివాడు. తాను తెలుసుకొన్న మర్మాలన్నీ అందరికీ చెప్పాలి. అని తోటిన బాలురను పిలిచి,

తెండెల్ల పుస్తకంబులు, నిండాచార్యులకు మఱల నేకతమునకున్
రండు విశేషము సెప్పెదఁ, బొండొల్లనివారు కర్మ పుంజము పాలై ॥

అని తోటి బాలురనందరినీ పిలిచాడు. ' రండి! శ్రీహరి భక్తి ప్రేమలను ఆటలు ఆడుదాం. విష్ణు కీర్తి గాధలను పాడుదాం. గోవిందుని భక్తితో కొలుద్దాం' అని' ఈ గురువులు శ్రీహరి పదములను చేరే మార్గాలను చెప్పరు. అర్థం లేని పనికిమాలిన విషయాలు చెప్తారు. మీకు మేలు

కలిగించే విషయాలను నేను చెబుతాను' అన్నాడు.వ్యాసులవారు చెప్పారు. కౌమార మాచరేత్ ప్రాజ్ఞః - చిన్న వయస్సులోనే వేదాలు అధ్యయనం చెయ్యాలి.

ప్రహ్లాదుడు ఎట్టివాడు అంటే- అడుగడుగునకు మాధవాను చింతన సుధా మాధుర్యమున మేను మరచు వాని - అడుగడుగునా మాధానుచింతనా సుధారసమును గ్రోలి మేను మఱచువాడు. శరీరాన్ని మరిస్తే ప్రపంచాన్ని మరచినట్లే. జనక చక్రవర్తితో 'రాజా! రాజ్యం తగులబడుతోంది' అని సేవకులు చెప్తే, ఈ దేహమే నేను కాదు,ఈ రాజ్యం నాదెందుకవుతుంది?' అన్నాడు. కాబట్టి ఈ సంసారం సుఖ దుఃఖాల కూటమి అని తెలుసుకోవాలి. అజ్ఞానం తొలగాలంటే, ఆవరణ విక్షేప దోషాలను తొలగించుకోవాలి. ఆవరణ దోషం అంటే తానెవరో తెలుసుకొనలేక పోవటం; విక్షేప దోషం అంటే ఉన్నదానిని లేదనుకోవటం. దీనికి ఉదాహరణ రజ్జు సర్ప భ్రాంతి. ప్రకాశం యొక్క అభావమే అజ్ఞానం.

సంసారం కల వంటిది. కళ్ళు తెరిస్తే కల పోతుంది. అలాగే కనులు మూస్తే సంసారం అనే కల పోతుంది. విచారణ చెయ్యాలి. విచారణ చేస్తే అజ్ఞానం పోతుంది. పెళ్ళికి వచ్చిన ఒకడిని చూసి పెళ్ళి కొడుకు వారు అతడు పెళ్ళి కూతురు తరఫు వాడని; పెళ్ళి కూతురు వారు అతడు పెళ్ళికొడుకు తరఫు వాడని అపోహ పడ్డారు. వారందరూ అతనిని నిలదీసే లోపల అతడు పలాయనం చిత్తగించాడు. అతడిని తిట్టారా? కొట్టారా? విచారణ వల్ల పోయింది. 'విచారేణ నన్య సాధనైహి న కించిత్ కర్మ కోటిభిః' -(వివేక చూడామణి). విచారణ గురు సాన్నిధ్యంలో చేస్తే అజ్ఞానం తొలగిపోతుంది. అజ్ఞానం చేత అనిత్యమైన సంసారం నిత్యమని భావించాము. ప్రహ్లాదుని వలె భక్తి ద్వారా భగవత్ అనుగ్రహమును పొందవచ్చును. మనంకూడా ఆ ప్రభువును నమ్మి కొలిచి భగవత్ అనుగ్రహమును పొందుదుము గాక!

# పరమపూజ్య శ్రీ మాతా జ్యోతిర్మయానంద భారతివారు

(గత సంచిక తరువాయి) సేకరణ -రమణ ప్రసాద్

సాధకుడికి అజ్ఞానం అడ్డు వస్తుంది. అజ్ఞానం ఉన్నంతవరకు రావటం పోవటం తప్పదు. అంటే రైతు ఏ విధంగా కలుపు మొక్కలు ఏరివేస్తాడో, ఆ విధంగా మనలోని అవగుణాలను ఏరివేయాలి. ఎందరో తొక్కిన రాయిని శిల్పి తెచ్చి దానిలో అక్కరలేని పదార్థాన్ని తీసివేస్తాడు. అప్పుడు ఆ రాయి లక్ష్మీదేవి విగ్రహంగా మలచబడి అందరిచేత పూజింపబడుతుంది.

అసంగ శస్త్రేణ దృఢేన ఛిత్వా - మనలో ఉన్న అహంకారాన్ని రూపుమాపాలి. అంటే జ్ఞానేంద్రియాలు ఐదు, మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము అనే ఈ ఎనిమిది స్వాధీనం కావాలంటే గురుపాదాలు పట్టాలి. నోరు ఇచ్చినందుకు హరి సంకీర్తన చెయ్యి. గుండెనిండా భగవంతుని పెట్టుకో. చేతినిండా దానం చెయ్యి.



త్వగేంద్రియం వల్ల ఏనుగు; శ్రవణేంద్రియం చేత లేడి; నయనేంద్రియము వల్ల మిడుత; రసనేంద్రియం వల్ల చేప; ఘ్రాణేంద్రియం వల్ల తుమ్మెద మోసపోయి ప్రాణాలను పోగొట్టుకుంటున్నాయి.

శబ్దాదిభిః పంచభి రేవ పంచ
పంచత్వ మాపుః స్వగుణేన బద్ధాః
కురంగ మాతంగ పతంగ మీన
భృంగా నరః రంచితఃకిమ్ ॥ (వివేక చూడామణి)

కాని మనుష్యుడు ఈ పంచేద్రియాలచేత ప్రేరేలింపబడుతున్నాడు. వాడి గతి ఏమిటి? మనస్సు, చిత్తము, బుద్ధి చెప్పినట్లు వింటే ఇంద్రియాలు వశమవుతాయి.

అజ్ఞానం ఎక్కడ ఉంటే అహంకారం అక్కడ ఉంటుంది. అహంకారాన్ని తొలగించుకోవాలంటే అజ్ఞానాన్ని తొలగించుకోవాలి. దానిని తొలగించే సమర్థులు గురుదేవులొక్కరే. అజ్ఞాన తిమిరాంధస్య జ్ఞానాంజన శలాకయా - అజ్ఞానం అనే పొరను జ్ఞానాంజనం అనే శలాకతో గురుదేవుడు తొలగిస్తాడు. ఆ శక్తి గురుదేవునికే ఉంది. అందుచేత గురుదేవులు ఉపదేశించిన మంత్రాన్ని నిరంతర చింతన చేయాలి. అమ్మ ఏర్పాటు చేసిన మంత్ర దీక్షను మీరంతా నిష్ఠగా చేసి గురు ఋణం తీర్చుకోండి. ఓం తత్సత్ !

(గత సంచిక తరువాయి)

# యోగవాశిష్ఠము

- సుషుమ్నా ప్రసాద

"నీ మనసు వేసిన ముద్రతో, నిన్ను వొక ఛండాలునిగా వూహించుకొనేట్లు చేసింది, నీ మనస్సును వొకే విషయముపై, యేకాగ్రతతో కేంద్రీకరించటము వలన నీకు ఛండాలుని జీవితము ప్రస్ఫుటంగా గోచరించేట్లు చేసింది. అదే ఆలోచన నీ అతిథియైన బ్రాహ్మణుని మనుసులో కూడ ముద్రవేసుకొన్నది, అతను కూడ చలించాడు, కాని, కొబ్బరి కాయ కథవలె, యీ సంఘటన కీరదేశస్తులలో, భూటాన్‌లో నివసించిన వారందరి మనసుల్లో ముద్రవేస్తున్నది. ఆ మానసిక విచారణ అందరి మనసుల్లో ఆ సంఘటన సత్యమని భావాన్ని రూఢి చేసింది, ఇవన్నీ మనసు యొక్క వైవిధ్యమైన ఊహలు మాత్రమే, ఈ జగత్తులో యేదీ సత్యముకాదు.



ఇవన్నీ నీ వూహాజనితమైన వీచికలు మాత్రమే నీవు విన్నదీ, చూచినది మొత్తము మనసు యొక్క కల్పనా విస్తరణమాత్రమే, అనేక వస్తువులను గురించి కలగన్నప్పుడు, అవన్నీ ముందున్నట్లు భావించినట్లు, ఆశలతో, కోరికలతో వుద్రిక్తతమైన మనసు, అవన్నీ స్వప్నములలో తన ముందున్నట్లే భ్రమింపచేస్తుంది. వాస్తవంగా, అక్కడ భూటాన్ ప్రజలు గాని, కీర దేశస్థులుగాని, అతిథిగాని యెవ్వరూ లేరు, ఇదంతా వొక పగటికల, నీ మనోనేత్రంతో చూసేదంతా, అవాస్తవమే, సత్యమేమిటంటే భూటాన్ దేశమునకు వెళ్లే మార్గంలో, వొక సందర్భమున, వొక పర్వతపు గుహలో ఆగావు. చాలా దూరప్రయాణము చేయటం వలన, నీవు గాఢ నిద్రలోకి జారావు, నిద్రలో ఛండాలుని గురించి, భూటాన్ నగరం గురించి, కీర దేశం గురించి కలగన్నావు.'

'మనసు యొక్క మాయాజాలంతో, నీవు తటాకంలో తపస్సుకై దిగినపుడు, ఆ దృశ్యాలన్నీ చూచావు. మనసు యొక్క మోస ప్రదర్శన నిజంగా చాలా అద్భుతమైనది, ఒకే ఆటను అనేక బాలకులు అనేక రకాలుగా ఆడి, మురిసిపోతున్న విధంగా, వివిధమైన మానవులు, యీ

విశ్వమనే కలను అనేక రకాలుగా దర్శిస్తారు, కాకి, కొబ్బరి కాయ కథలో వలె, నొక సమయంలో అనేక సంఘటనలు జరగవచ్చు.

కొబ్బరి చెట్టుకు కాచే కొబ్బరి బొండం చాలా బరువైనది, అది చెట్టుకు గట్టిగా అతుక్కొని వుంటుంది. అందువల్ల హఠాత్తుగా చెట్టును, వూడి, నొకరి నెత్తిపై పడదు, ఒక సందర్భములో వొక వ్యక్తి ఆ చెట్టు క్రింద కూర్చుండి, ఆ కొబ్బరి బొండాల గుత్తి వంక చూస్తున్నాడు. అదే సమయంలో నొక కాకి ఎగిరి వచ్చి, ఆ కొబ్బరి కాయల గుత్తిపై కూర్చుంది, అప్పడే వొక బొండం క్రింద పడ్డది, వెంటనే ఆ వ్యక్తి యిలా అన్నాడు, ఆ కాకికి చాలా పదునైన గోళ్లున్నవి అందుచేతనే పదునైన కత్తితో మాత్రమే తెగే కొబ్బరి బొండంను, కాకి నేల కూల్చింది"

వాస్తవంగా జరిగిందేమిటంటే ఆ కొబ్బరి బొండం చెట్టునుండి వూడి క్రిందపడటానికి సిద్ధంగా వున్న సమయంలో, ఆ కాకి గుత్తి మీద వ్రాలింది. అది కాకతాళీయంగా  జరిగిన సంఘటన.

అదే విధంగా, ఛండాలునికి సంబంధించిన వూహ, సమకాలికులైన కీర దేశస్థులు, భూటానీయులు, మరియు నీ మనసులో, అవాస్తవమైనా, అందరి మనసులలో స్థిరపడ్డది; ఒక ఛండాలుడు ఆ పల్లె పొలిమేరలో వొక కుటీరం నిర్మించుకొని వుండటము సత్యము, అది పాడుపడ్డ స్థితిలో వున్నది, అక్కడ నీవు పొరబడ్డావు.'

'నేను, నీవు, వాడు, నాది, నీది, యిది, అది యని భేద భావమున్న అజ్ఞానులు మాయా ప్రభావమునకులోనై, బాధలు, కష్టాలు, అనుభవిస్తున్నారు. ఎవరైతే సర్వే సర్వత్రా అవధులు లేని, సర్వవ్యాపకమైన ఆత్మను దర్శిస్తారో, వారు యీ విశ్వము బ్రహ్మము తప్ప మరొకటి కాదని నిశ్చయముగా గ్రహించి, యెప్పడూ ప్రశాంతంగా, ఆనందంగా వుంటారు. వారికే వస్తువుపై తీవ్రమైన కోరికగాని, అనుబంధముకాని వుండదని, అట్టి వారు అజ్ఞానాన్ని పూర్తిగా నిర్మూలం చేసినవారు. నీవింకా మనసు యొక్క మాయా ప్రభావమునకు లోనైవున్నావు, నీ వింకా స్వచ్ఛమైన జ్ఞానాన్ని పొందలేదు.'

- సశేషం

# శ్రీ మహాభారత నీతి చంద్రిక

## మాతృదేవో భవ

- శ్రీ రామానుజ దాసు

కశ్యప ప్రజాపతికి ఇద్దరు భార్యలు. వారు వినత, కద్రువ. వీరు యిరువురు కలసి ఒకరోజు విహారానికి వెళ్ళారు. అక్కడ వారు సముద్ర మధనంలో పుట్టిన ఉచ్చైశ్రవం అనే గుఱ్ఱాన్ని చూశారు. ఆ గుఱ్ఱాన్ని చూడగానే కద్రువ వినతతో 'చూడు! గుఱ్ఱం తెల్లగా వున్నప్పటికీ దాని తోక భాగం నల్లగా వున్నది కదూ!' అన్నది.

'అక్కా! నీవు పొరబడుతున్నావు. దాని తోక భాగం కూడా తెల్లగానే వుంది. మహాత్ముని కీర్తిలాగ తెల్లగా ప్రకాశిస్తోంది' అని వినత అన్నది. దానికి కద్రువ 'సరే! ఒక పందెం వేసుకుందాం. తోక నల్లగా వుంటే, నీవు నాకు దాసివి కావాలి, తెల్లగా వుంటే నేను నీకు దాసినవుతాను' అన్నది. ఈలోగా సూర్యాస్తమయం అయింది. రేపు ఉదయం వచ్చి చూద్దాం అనుకున్నారు.

ఇంటికి వెళ్ళిన కద్రువ తన కుమారులైన పాములను పిలిచి, 'కుమారులారా! ఈరోజు మీ పిన్ని వినత, నేనూ ఒక పందెం వేసుకున్నాం. ఉచ్చైశ్రవం అంతా తెల్లగానే వుంది. తోక మాత్రం నల్లగా వున్నదని నేను, కాదు అంతా తెల్లగానే వున్నదని వినత వాదించుకుని దాసత్వమును పందెంలో నిర్ణయించుకున్నాము. నా దృష్టికీ ఆ అశ్వం తోక తెల్లగానే వున్నట్లు తోస్తోంది. మిమ్మల్ని ఆజ్ఞాపిస్తున్నాను. మీరు వెళ్ళి ఆ అశ్వం తోకకు చుట్టుకుని దాన్ని నల్లగా చేయండి. లేకుంటే నేను వినతకు దాసీని అవుతాను' అని చెప్పగా, పాములన్నీ 'ఇది నీతి రహితం' అని గర్హించాయి. కద్రువ కోపంతో 'పరీక్షిత్తు కుమారుడైన జనమేజయుడు చేసే సర్ప యాగంలో మీరు మరణం పొందుదురు గాక!' అని శపించింది.

శాపం అనుభవించటానికి భయపడిన కర్కోటకుడు అనే పాము తల్లి ఆజ్ఞాపించిన విధంగా ఆ అశ్వము తోకకు నల్లగా వుండేలాగ వ్రేలాడగా వినతి ఓటమిని అంగీకరించి కద్రువకు దాసీ అయింది. కొన్నాళ్ళకు వినతకు రెండవ అండము నుండి గరుత్మంతుడు పుట్టాడు. (వినతకు రెండు అండములు ప్రజాపతి యివ్వగా మొదటి అండము నుండి పుట్టిన వాడు అనూరుడు).

తన తల్లి దాస్యము చేస్తూ వుండటం వలన కద్రువ సంతానానికి తాను కూడా దాసుడుగా వుండవలసి వచ్చింది. కద్రువ తన సంతానాన్ని యెత్తుకుని తిరుగుతూ వుండాలని, యే పని చెప్పినా తిరస్కరించ వద్దని

హెచ్చరించింది. గరుడుడు సర్పాలను తన మూపుపై కూర్చోపెట్టుకుని ఎగురుతూ వున్నాడు. ఒకనాడు సర్పాలను యెక్కించుకున్న గరుడుడు సూర్య మండలం వరకు యెగురగా ఆ సూర్యుని తీక్షణమైన కిరణాల వేడిమికి పాములు తలలు వాల్చేశాయి. మూర్ఛిల్లిన సర్పాలను చూసిన కద్రువ గరుడుని నిందించి, ఇంద్రుని ప్రార్థించింది. ఇంద్రుడు కరుణించి ఆకాశమంతా మేఘావృతం చేసి, వర్షాన్ని కురిపించాడు. దానితో సర్పాలు స్వాంతన పొంది, మూర్ఛ నుండి తేరుకున్నాయి. ఒకనాడు గరుడుడు తల్లి వద్దకు వెళ్ళి 'అమ్మా! పెద్ద పెద్ద పర్వతాలను నా ముక్కుతో పొడి పొడి చేయగలను. నా రెక్కల నుండి వీచే గాలి వల్ల ప్రళయాన్ని సృష్టించ గలను. ఈ విశ్వమంతా మూపుపై మోయగలను. అంతటి బలవంతుడిని అయినా నీచమైన యీ సర్పాలను మోయవలసిన అగత్యమేమిటి? నేను సర్పాల ఆజ్ఞను ఎందుకు పాటించాలి? నాకు ఈ దాస్యం ముమ్మాటికి యిష్టం లేదు. ఈ దాస్యం ఎందుకుచేయాలి? కారణమేమిటి?' అని తల్లిని ప్రశ్నించాడు. జరిగిన వృత్తాంతమంతా గరుడికి తెలియజేసింది వినత.

గరుడుడు సర్పాల వద్దకు వెళ్ళి 'నా తల్లి దాస్యం, నా దాస్యం పోవడానికి నేనేం చేయాలి? మీకు యేది యిస్తే దాస్యం నుండి విముక్తి లభిస్తుంది? అది ఎంత కష్టమైనా మీకు సమర్పిస్తాను' అన్నాడు. దానికి సర్పాలు అమృతాన్ని తెచ్చి యిమ్మని కోరాయి. గరుడుడు సరేనని పలికి అమృతం తీసుకురావడానికై బయలుదేరాడు.

ముందుగా తల్లియైన వినత వద్దకు వెళ్ళి నమస్కరించాడు. 'దేవతలు అందరూ సదా నీకు రక్షగా వుండెదరుగాక!' అని ఆశీర్వదించింది. 'అమ్మా! అమృతం తేవడానికి వెళ్తున్నాను. కాని అక్కడ యేమి తినాలో, తగిన బలమిచ్చే ఆహారమేదో' చెప్పు అన్నాడు. 'నాయనా! సముద్రగర్భంలో నిషాదుల స్థావరం వుంది. భూమిలో ప్రజలకు క్లేశం కలిగిస్తున్న వారిని తిను. బ్రాహ్మణులను మాత్రం తినకు' అని చెప్పింది. 'వారిలో బ్రాహ్మణులెవరు?' అని అడుగగా, 'ఎవరినైతే మ్రింగబోతుండగా గొంతులో ముల్లులా గుచ్చుకుని, అగ్నివలె కాలుస్తుంటాడో, అట్టి వానిని బ్రాహ్మణుడిగా తెలుసుకో'మని వినత చెప్పింది. తల్లిమాట ప్రకారం సముద్ర గర్భాన నిషాదులందరినీ ఒకేమారు మ్రింగగా, ఆ నిషాదులలో బ్రాహ్మణుడు వుండి గొంతులోనికి దిగకక అగ్నివలె కాలుస్తుండగా, ఆ లక్షణాన్ని బట్టి బ్రాహ్మణుడని గుర్తించి విడిచి పెట్టాడు.

- సశేషం

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమంలో కార్యక్రమాలు

జనవరి 2016

1 శుక్ర : ఆంగ్ల సంవత్సరాది, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

4 సోమ : శ్రీగురుదశమి, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ

8 శుక్ర : మాసశివరాత్రి, పావులూరు బ్రాంచిలో ఏకాహం

10 ఆది : అమావాస్య

14 గురు : భోగి శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన, రాత్రి 8గం. శ్రీబాబుకు భోగిపండ్లు పోయుట.

15 శుక్ర : సంక్రాంతి, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన

16 శని : కనుమ, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

24 ఆది : పూర్ణిమ, శ్రీసద్గురుపాదపూజ

26 మంగళ : రిపబ్లిక్ డే

ఫిబ్రవరి 2016

3 బుధ : శ్రీగురుదశమి, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ

7 ఆది : మాసశివరాత్రి, పావులూరు బ్రాంచిలో ఏకాహం

8 సోమ : అమావాస్య

14 ఆది : రథసప్తమి

18 గురు : భీష్మఏకాదశి, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ

22 సోమ : గురుపూర్ణిమ, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్త సమారాధన

# పరిప్రశ్నేన సేవయా - పరాశర ప్రసాద్

సద్గురుదేవులు దీక్షను ప్రసాదించి, దీక్షలో యెలా వుండాలో నేర్పించారు. గురుసన్నిధిలో వుండి యీ ఉపాధితో తృప్తిగా జీవిస్తే యిక రాకపోకడ వుంటుందా? సంశయం వున్నవారికి తప్పదేమో! సంశయం లేనివారికి దాన్ని గురించి ఆలోచన చేసే పని వుండదు. మనం ఆచరించే దీక్ష దేనికి? దీక్ష కేవలం సాధకునికి తగిన శిక్షణను ప్రసాదించటానికేనేమో!



దేహానికి శిక్షణ అవసరం లేదు. ఇంద్రియానికి శిక్షణ అవసరమే. అయితే యింద్రియాలను అదుపు చేయటం అంత సులభం కాదు. మనం ఆచరించే దీక్ష కేవలం మనస్సును నియంత్రించటానికే అని గుర్తించాలి. మనస్సులో జనించే తలంపులు, భావనలు బహిర్ముఖమై యింద్రియాల వైపు మరలి ప్రపంచంలోకి వెళితే అశాంతి తప్పదు. మనం ఆచరించే దీక్ష భగ్నం అవుతుంది. అలా కాకుండా మనస్సులో జనించే భావాలను సద్గురుమూర్తి దివ్యచరణారవిందములకు సమర్పిస్తే ఆ భావనలే మనస్సుని అంతర్ముఖం చేసి, మనస్సును నిశ్చలంగా, నిర్మలంగా వుంచగలుగుతాయి. అది క్రమేపి నీ సాధన ధ్యేయాన్ని గుర్తింపజేస్తుంది. సద్గురుమూర్తి ప్రసాదించిన దీక్షను సక్రమంగా ఆచరించినవారు 'ధీయతే విమలం జ్ఞానం, క్షీయతే కర్మవాసన' అన్నట్లుగా అంతర్గతంగా సూక్ష్మాతిసూక్ష్మంగా దాగి వున్న కర్మ వాసన రహితమై, మరుక్షణమే జ్ఞానప్రకాశం నీలో బహిర్గతమవుతుంది.

సద్గురుదేవులు యెన్నో మంచి మాటలు మన సర్వేంద్రియాలకు అందించారు. ఎంతకాలం, యెంత బోధ శ్రవణం చేశారో యెవరైనా అంచనా వేయగలరా? పోనీ మనం కొనసాగించే దీక్ష సఫలం అవ్వటానికి యెంత శ్రవణం చేయాలో కొలతకి అందుతుందా?

అందువలన సద్గురుదేవులు అనుక్షణం హెచ్చరిక చేసినది మనం మరువగలమా? ఈ దేహాన్ని యిక్కడే వదిలివేసి, మనం నిష్క్రమించే సమయం వచ్చే లోగా, విచారణ ద్వారా తిరిగి యేదో వుపాధిని ఆశ్రయించ నవసరంలేని స్థితిని పొందాలని సద్గురుదేవులు మనకి ప్రసాదించిన దీక్ష లక్ష్యం. ఈరోజు గురుదేవులు సాధకులందరికీ ప్రసాదించిన జీవితం కన్న గొప్పది లేదన్న విషయం కూడా గుర్తించాలి. ఈ సదవకాశాన్ని దుర్వినియోగ పరచుకుంటే తిరిగి యీ మానవ జన్మ వస్తుందన్న గ్యారంటీ వుందా?

# శ్రీకాళీ వనాశ్రమము

- పెనుమాక నాగేశ్వరరావు

పరమాత్ముడల్లిన పర్ణశాల, కృపారసంబు వర్షించు సద్గురుశాల
సుఖశాంతులందించు చంద్రశాల, ఆధ్యాత్మికోపన్యాసాల పాఠశాల
ఆయురారోగ్యములిచ్చు వైద్యశాల, భవరోగముల బాపు ఔషధశాల
అష్టైశ్వర్యములందించు టంకశాల, సుప్రసాదంబులందించు వంటశాల
భక్తిగీతాలు వినిపించు గాత్రశాల, వారు వాడి వదిలిన వస్తు ప్రదర్శనశాల
ఆశీస్సులందించు అద్భుత ప్రేమశాల. పరమ పవిత్రమైన గోశాల
క్రతువులు జరిగే యాగశాల, బాబూజీ నడయాడిన స్వర్ణశాల
మనందరి మదిలో మెదిలే సువిశాల స్వర్ణశాల,
ఇది ముమ్మాటికీ పరమాత్ముడల్లిన పర్ణశాల

---

## పూజ్య శ్రీ చంద్ర కాళీ ప్రసాద మాతాజీ వారి సత్సంగ సమావేశములు

## శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమం-హైదరాబాదు శాఖ

 ది.22.01.2016(శుక్రవారం)నుండి ది.26.01.2016 (మంగళవారం) వరకు జరుగును. ప్రతిరోజు ఉదయం ది.9గం.లనుండి11గం.లవరకు శ్రీ రామానుజదాస్ గారిచే ప్రవచనం; ది. 22.01.2016 న 11గం.లకు కుంకుమ పూజలు జరుగును; ది. 24.01.2016 గురు పౌర్ణమి, శ్రీ సద్గురు పాద పూజ; ది.26.01.2016న ఉదయం 11గం.లకు సామూహిక శ్రీ సద్గురు పాదపూజలు జరుగును.

సాయంకాలం ప్రతిరోజు సా॥5 గం.లనుండి 6గం.లవరకు సంకీర్తన; 6గం.లనుండి 8 గం.లవరకు శ్రీ మాతాజీ బోధామృతము; ప్రార్థన, తీర్థ ప్రసాదముల వితరణ జరుగును.

కార్యక్రమ స్థలం : శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమం; శ్రీరామనగర్ కాలని, సరోజనీదేవి కంటి ఆసుపత్రి వెనుక; మెహదీపట్నం, ఫోన్ : 040 23329062

 (గమనిక:ది. 12..02.2016 శనివారం నాడు శ్రీ సద్గురు క్షీర శిలామూర్తుల ప్రతిష్టా మొదటి వార్షిక మహోత్సవము జరుగును.)

# శ్రీకృష్ణ కర్ణామృతము

(గత సంచిక తరువాయి)

- సుశీలా ప్రసాద

అభినవ నవనీత స్నిగ్ధ మాపీత దుగ్ధం ।
దధి కణ పరిదిగ్ధం ముగ్ధ మఙ్గం మురారీ ।
దిశతు భువన కృచ్ఛ చ్ఛేదితా పిఞ్ఛ గుచ్ఛ ।
ఛవి నవ శిఖిపిఞ్ఛ లాఞ్ఛితం వాఞ్ఛితం నః॥

తాత్పర్యము -



అప్పుడే చిలికిన వెన్నముద్దవలె మిసమిస లాడునది, దప్పిక తీరునట్లు త్రాగబడిన పాలు గలదియు, పెరుగు చినుకుల చేత పూయబడినది లోకముల ఆపదలను బాపునదియు, క్రానుగు గుత్తి కాంతివంటి కరాంతి గలదియు, క్రొత్త నెమలిపురి చేత అలంకరింపబడినది సుందరమైన కృష్ణుని యొక్క ఒడలు మాయొక్క కోరికలను యిచ్చుగాక!

తెల్లవారటానికింకా చాలా సమయమున్నది. ఆకాశంలో నిండు చంద్రుని వెన్నెల తెల్లగా పిండారబోసినట్లు అంతటా పరచుకుని వుండే సరికి తెల్లవారిందనుకుని చెట్ల మీద పక్షులు కిలకిలా రవాలు చేస్తున్నాయి. ఆవేళలో నందరాజుగారింటి పెరటిలోని బాదంచెట్టు మీద గూడుకట్టుకుని ఉన్న ఒక కాకి పిల్ల తల్లితో గొడవపడుతోంది. అది 'నాకిప్పుడు చాలా ఆకలిగా ఉన్నదమ్మా! పడుకునే ముందు కూడా నాకు కడుపునిండా తిండి పెట్టలేదు కదా!' అని వాదిస్తున్నది.

'దొరికిందేదో నీకే తెచ్చిపెట్టాను కదా. నేనసలే తినలేదు. ఏం చెయ్యమంటావు? ఇప్పుడు ఆకలి అంటే ఏం చేయమంటావు? ఎలాగో కళ్ళు మూసుకుని, కడుపులో కాళ్ళు పెట్టుకుని పడుకో. వెలుగు రాగానే తెల్లవారాక దొరికిందేదో నీకు తెచ్చిపెడతాను మరి' అన్నది తల్లి. కాని ఆ పిల్లకాకి తల్లి మాటలకు శాంతి పడలేదు. ఇది ఇలా ఉండగా.........

"ఇదేం పిల్లాడమ్మా! అర్థరాత్రిలేచి కూచుని ఆకలంటాడు. ఇప్పుడు తింటే అరుగుతుందా? చిన్నారితండ్రికి" అని వాపోతోంది యశోదమ్మ. "సందెవేళ పాలబువ్వ పెడతానంటే తినకుండా పడుకున్నాడు. ఇప్పుడు లేచి కూర్చుని ఆకలంటాడు" అని రుసరుస లాడుతోంది యశోదమ్మ. "ఏమిటే గొడవ?" అంటూ లేచివచ్చిన నందగోపన్న అంతా విని, "వాడి

కెప్పుడు ఏది కావాలంటే అది పెట్టవే! మనకేమి తక్కువ" అని మందలిస్తూ అన్నాడు. "ఇదిగో యిలా గారాబం చేసి నెత్తికెక్కించుకుంటున్నారు. వాడు మీ అలుసు చూసి మరీ రెచ్చిపోతున్నాడు" అని గొణుక్కుంది యశోదమ్మ. "లేకలేక కలిగినాడు. వాడు మన నెత్తిమీద దేవతే కదా! వాడి ఆకలి చూడు. అంతేకాని సమయం సందర్భం యేమిటి? " అన్న భర్త మాటలకు యశోద సర్దుకుని పాలబువ్వ కలపడానికి బిడ్డను చంకనెత్తుకుని వంటింట్లోకి నడిచింది.

అంతలో కన్నయ్య కోపంగా 'నాకిక్కడ వద్దమ్మా! పెరట్లో చందమామను చూస్తూ అక్కడే తింటాను' అని పేచీపెడుతున్నాడు. తల మీద వున్న నెమలిపింఛము తీసి నేలకేసి కొట్టాడు. ఇక వాడి అల్లరి భరించలేక పెరట్లోకి నడిచింది యశోదమ్మ.

చేతిలో మిసమిసలాడే వెన్నముద్ద వుంచింది. పెరుగన్నం కలిపి తినిపించబోతుంటే, తినకుండా అదంతా చుట్టూ విసురుతున్నాడు. దాంతో ఒళ్లంతా పెరుగుచినుకులే! వెన్నముద్దలు కూడా చిన్నచిన్న వుండలుగా చేసి యెదురుగా వున్న చెట్లలోకి విసరసాగాడు. పాలు త్రాగుతూ అవన్నీ వుమ్ములు వేస్తున్నాడు.

"చూడండి! మీ కొడుకు దుడుకులు. అసలు వీడు తినటానికా? యీ నాటకాలు నా ప్రాణం తీయటానికా?" అంటూ యశోదమ్మ నేరాలు చెప్పసాగింది. "ఏమోనే వాడెందుకు అలా చేస్తున్నాడో! వాడు ఆడింది ఆట, పాడింది పాట! అంతే చూసి సంతోషించు" అన్నాడు నందగోపన్న.

ఇంట్లో దీపాలు వెలుగుతూ మాటలు వినిపిస్తుంటే బాదం చెట్టు మీద నిద్రపట్టని తల్లికాకి బయటకు వచ్చి కొడుకుకు అన్నం పెడుతున్న తల్లిని, వాడు తినకుండా విసిరేసిన బువ్వని చూసింది. ఆనందంగా అదంతా ముక్కున కరచుకుని చెట్టుమీదకి వెళ్లి పిల్లకాకికి అందించింది. ఆ రెండు పిట్టలు తమకి ఆహారం పెట్టడానికి తను తింటునట్లు నటిస్తున్న బాలగోపాలుని మరీమరీ చూశాయి. కన్నయ్య పెట్టిన ప్రసాదం తిన్నాక కలిగిన జ్ఞానంతో ఆపద్బాంధవుడైన వాని లీలలను అర్థం చేసుకున్నాయి ఆ పక్షులు రెండూ. బ్రహ్మానందాన్ని పొందాయి. కాని యీ లీలను యశోదమ్మ యెరుగదు. తన తల్లిమీద మాయకప్పి వుంచాడు నటన సూత్రధారి కన్నయ్య లీలలను అల్లరి అనుకుంటోందా పిచ్చితల్లి!!

# కర్మయోగము

(గత సంచిక తరువాయి) - పూజ్య యోగిని శ్రీ చంద్ర కాళీ ప్రసాద మాతాజీ

సత్కర్మలను ఆచరిస్తేనే ముక్తి అని, దుష్కర్మలను ఆచరించ కూడదు అని తెలిసి కూడా సామాన్య మానవుని సంగతి సరేసరి, యెందరో పండితులు, మేధావులు కూడా యెందుకు సత్కర్మలను ఆచరించ లేకపోతున్నారు? దుష్కర్మలను యెందుకు ఆచరిస్తున్నారు? అన్న ప్రశ్నలు సహజంగానే కలుగుతాయి.

మనం యెన్నో జన్మల నుంచి మన సంస్కారాలను మనతో తెచ్చుకుంటున్నాము. అవి యిప్పటికే చాలా బలాన్ని పుంజుకున్నాయి. వాటి బలం ముందు మన బాహ్యేంద్రియ నిగ్రహం, శాస్త్రజ్ఞానం దేనికీ కొరగావు. ఉదాహరణకు ఒకనికి మధ్యపానం వలన కలిగే అనర్థాలను యెంతో బాగా మధ్యపానం చేయనివానికన్నా బాగా తెలిసినా, వాడు తాగకూడదు అనుకుంటున్నా, మధ్యం యెదురుగా కనిపించేసరికి అతని జ్ఞానం కాక, అతడి ప్రకృతే పని చేసి త్రాగకూడదు తప్పుచేస్తున్నాను అని అనుకుంటూనే త్రాగుతాడు. కాని, త్రాగటం మాత్రం మానలేడు.

రజో గుణం నుండి కలిగేది కామం. అది తీరకపోతే కలిగే క్రోధం రెండూ పాపాచరణానికి మూల హేతువులు. మనస్సు ఇంద్రియాల ద్వారా విషయాదుల మీదకు పోతున్నప్పుడు కలిగే ఆకర్షణ, వికర్షణల మూలంగా కామక్రోధాదులు కలుగుతాయి. వాటి ప్రభావం వలన మనస్సుకు యిచ్ఛా ద్వేషాలు, వాటి వలన పాపాచరణం జరుగుతుంది.

వాంఛ అన్నిటికన్నా ప్రధానమైనది. ఈ కామము బుద్ధి గుహలో అజ్ఞాన తమోరూపమైన అహంకారంలో అణిగి దాగి వుంటుంది. దాని వాసనలు తమోగుణ ప్రభావం వలన జ్ఞానాన్ని కప్పివేస్తాయి. రజోగుణ ప్రభావం వలన చిత్త విక్షేపాన్ని కలిగిస్తాయి. ఆ విధంగా మనకు మోహం కలుగుతుంది.

కొందరిలో యీ కామం నిప్పును పొగ ఆవరించినట్లు పలుచటి పొరలాగా వుంటుంది. కొంచెం ఊదినా, విసిరినా చాలు, పొగపోయి అగ్ని బయట పడుతుంది. అదే విధంగా సాత్విక ప్రకృతిలో శ్రవణమాత్రం చేతనే కామం నశించి, జ్ఞానజ్యోతి దర్శనమిస్తుంది. రజోగుణ ప్రధానులలో యీ కామావరణం కొంచెం దట్టంగా, అద్దానికి పట్టిన మురికిలాగ ఆ మురికి కడిగితేకాని పోనట్లు, వారిలో యీ కామం శ్రవణ మనన నిదిధ్యాసల వలన తపస్సు వలన కాని, తొలగదు. ఇక తమోగుణ ప్రధానులలో యీ కామం మరింత దట్టంగా. దృఢంగా గర్భస్థ శిశువును ఆవరించి వుండే మావిలాగ వుంటుంది. ఈ మావి అనే ఆవరణ నవమాసములు నిండిన తరువాతగాని, అదీ యితరులు బహు ప్రయాసతో తొలగిస్తేకాని, యెలా తొలగదో, అదే విధంగా తమోగుణ ప్రధానులలో యీ కామం స్వప్రయత్నంతో తొలగించుకోవడానికి సాధ్యం కానిదిగా వుంటుంది.

మనం ఇంద్రియాలను మనస్సుకు ఉన్ముఖం చేసి, సత్కర్మలను నిష్కామంగా ఆచరించటం ద్వారా నియమించాలి. చంచలమైన మనస్సును బుద్ధికి ఉన్ముఖం చేస్తే, దాని చంచలత్వం హరిస్తుంది. బుద్ధిని కర్మయోగంతో, జ్ఞానయోగంతో ప్రక్షాళన చేయాలి. ఈ మూడు ఆవరణలు దాటి ఆత్మానుభూతిని పొందినప్పుడు కాని యీ కామం నశించదు.

మనకు పరమేశ్వరునితో గల సంబంధాన్ని తెలుసుకుని, సాక్షాత్కారాన్ని పొందాలి. జగత్తుతో మనకు గల సంబంధం పట్ల జాగరూకత వహించాలి. వాంఛలకు లొంగక, యీ జగత్తుకు ఆధారం ఆ పరమేశ్వరుడే అని అపరోక్షంగా తెలుసుకుంటే మనలోని మోహం నశిస్తుంది. మనకు శాంతి లభిస్తుంది. మనం తప్పక ఆత్మానుభూతిని పొంద గలుగుతాము. శ్రీకృష్ణ భగవానుడు భగవద్గీతలో బోధించిన కర్మయోగం యొక్క సారాంశం ఇదే!

హరిః ఓమ్ తత్సత్ !

# అమృతబిన్దూపనిషత్

(శ్రీదండి నిర్మలానంద స్వామి వారి బోధ సంక్షిప్తంగా)

(గత సంచిక తరువాయి) సేకరణ - పరాశర ప్రసాద్

చైతన్యము అచింత్యము. చిత్తము చైతన్య చింతన చేయలేదు. చైతన్యాన్ని పట్టుకోలేదు. నీకు భిన్నంగా వున్నదానిని గురించి చింతించవచ్చు. నీకు భిన్నంగా లేనిదానిని యెలా పట్టుకుంటావు? కత్తెరగాని, గొడ్డలిగాని, యే యితర పరికరాలుగాని, నీ చెయ్యి పట్టుకుంటుంది. ఆ పరికరాలు నీ చెయ్యను పట్టుకోలేవు కదా! నీ చేయి చైతన్య సహితం కాబట్టి అలా వీలవుతుంది. చిత్తముతో చైతన్యమును చింతించటానికి అందేదికాదని చింతన చేస్తే అప్పుడు అది గుర్తించబడుతుంది. చింతనకు అందని అచింత్యమైన చైతన్యానికి జాతి, గుణము, క్రియ లేవుకాబట్టి సంబంధం కూడా లేదు.

నీ అసలు స్వరూపం నేను. దానిని సిద్ధింపజేసుకోవటమే గాని పొందేది కాదు. అసలు సిద్ధి జ్ఞానసిద్ధి. బ్రహ్మాన్ని పట్టుకోవటానికి వుపాయం వుంది. యోగంలో నాదాన్ని చేర్చాలి. ధ్యానంలో నాదాన్ని చూస్తూ వుండాలి. అక్కడితో ఆగకూడదు. సత్తు చిత్తు వదిలివేయాలి. శరీర భావం లోపించాలి. బ్రహ్మాన్ని పట్టుకోవటానికి షణ్ముఖ ముద్ర వుంది. ఆ ముద్రలో నాదాన్ని ఆలకించాలి. అంతేకాదు ఆ నాదాన్ని విన్నవాడు యెవడు? అని విచారణ చేయాలి.

నాదాన్ని గుర్తించినవాడు నాద బ్రహ్మ. నాదమనేది భావము కాదు. అభావము అంతకన్నా కాదు. జగత్తు వున్నదని భావిస్తే బ్రహ్మ అయింది. బ్రహ్మము సద్రూపము కాదు. చిద్రూపము కాదు. రెంటికి అతీతమైనది. బ్రహ్మము నిష్కళంకము. అవయవ రహితమైనది. నిరవయవము. సూక్ష్మాతి సూక్ష్మమైనది. శుద్ధమైనది. కాబట్టి నిర్వికల్పము. బ్రహ్మవస్తువుకు పుట్టుక లేదు. నాశము లేదు. బంధన లేదు. జ్ఞానికి దేహభావన వుండదు. శరీరము నేను కాదు అని అనుకున్నవాడు వ్యవహారికంగా చేసే పిండప్రదానాలు చేయరు. నేను శరీరము కాదు అనే భావనే పిండ ప్రదానము. పోనీ, ప్రాపంచికంగా చేసే పిండ ప్రదానము వలన ఆ ఫలితము అందవలసినవారికి అందుతుందని గ్యారంటీ వుందా? మానవులు సాధరణంగా తీర్థయాత్రలు, సంకల్పాలతో చేస్తారు. ఏదో పుణ్యఫలాన్ని ఆర్జించాలనే భావనతో చేస్తారు.

దేహభావన లేని మహాత్ములు కూడా యాత్ర చేస్తారు. వారు

తమలో యేమైనా సంకల్పాలు బీజ రూపంలో వుంటే వాటిని రహితం చేసుకోవటానికి యాత్ర చేస్తారు.

పండితా సమవర్తనః కాదు. పండితా సమదర్శినః। అల్పజ్ఞుడు కాదు. స్వల్పజ్ఞుడు కాదు. బంధన అనేది లేదు. బంధన వుంటే మూడు అవస్థలలో అంటే జాగ్రత్, స్వప్న, సుషుప్తావస్థలలో వుండాలి కదా. నిదురలో బంధన లేదు కదా. దానిని తెలుసుకున్నవాడు పండితుడు. సద్గురుమూర్తి ప్రసాదించే లక్ష్యార్థం హస్తమస్తక సంయోగంతో మీ బుద్ధిని వికసింపజేసేది. మాలిన్యాన్ని నిర్మూలించేది. నీ స్వరూపాన్ని తెలియ జేసేది. 'అహం బ్రహ్మాఽస్మి' నేను బ్రహ్మను అనే స్థితికన్న వుత్తమ భావనకి తీసుకు వెళ్ళేది. బ్రహ్మైవాహఽమస్మి అనే స్థితిని పొందింపజేసేది. నేను బ్రహ్మను అనే భావనలో వెలితి వున్నది. 'బ్రహ్మను నేనే' అన్నది పూర్ణ స్థితి. దానిని సిద్ధింపజేసేది సద్గురుమూర్తి. హరిః ఓమ్ తత్సత్ !!

# హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

జనవరి 2016

4 సోమవారం శ్రీగురుదశమి; ఉదయం11 ని॥లకు శ్రీ సద్గురు పాదపూజ,

సత్సంగము, భక్తసమారాధన.

14 గురువారం భోగిపండుగ సా. 5-30ని॥లకు శ్రీ సద్గురుపాదపూజ సత్సంగం, భక్తసమారాధన.

22 నుండి 26 వరకు శ్రీ మాతాజీ సత్సంగ కార్యక్రమాలు.

24 ఆదివారం పూర్ణిమ; ఉ॥ 11 గం.లకు శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగము, భక్తసమారాధన.

ఫిబ్రవరి 2016

3 బుధవారం శ్రీగురుదశమి; సా.5-30 ని॥లకు శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగము, భక్తసమారాధన.

22 గురుపూర్ణిమ; శ్రీగురుదశమి; సా.5-30 ని॥లకు శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగము, భక్తసమారాధన.

వివరములకు : జగదీశ్వర్ సెల్ - 99856 66797

# అమెరికా పర్యటనలో శ్రీ మాతాజీ బోధ

(గత సంచిక తరువాయి) - రమణ ప్రసాద్

శ్రీ గురుదేవులు అతి గోప్యమైన మహావాక్యాలను సభాముఖంగా, అందరికీ అర్థమయేటట్లుగా వివరించి చెప్పారు. వాటిలో ఒకటి: మూలాభావమిదం జ్ఞాతం శరీరం నాస్తి కేవలమ్। ఈ శరీరం పరిణామం చెందేదే. అస్తి, జాయతే, వర్ధతే, పరిణమతే, అపక్షీయతే, నశ్యతే - అనే షడూర్ములు ఈ దేహానికి వస్తున్నాయి. ప్రాణ స్వరూపమైన చైతన్యమే మూలమైనది, నిత్యమైనది. ఈ శరీరం నశించేదే. స్వప్న ప్రతీయ మానాని రూపాణి యథా తథా। ఈ ప్రపంచం హుళక్కే. ఇది స్వప్నం వంటిదే.

ఒక రాజుగారు అడవిలో వేటకు వెళ్ళి అలసిపోయి ఒక చెట్టు క్రింద తన ఖడ్గం ప్రక్కన పెట్టి నిదురించాడు. ఆయన ఒక పెద్ద పులి గాండ్రిస్తూ మీద పడ్డట్లు కల కన్నాడు. ఖడ్గం కోసం వెతికాడు. అది కనిపించలేదు. ప్రాణ రక్షణకై దానితో కలియబడ్డాడు. అతనికి ఒక చెట్టు కొమ్మ తగిలి మెలకువ వచ్చింది. అక్కడ పులి లేదు. 'అయ్యో! ఈ కత్తి విసర లేదు. దెబ్బకు చచ్చి ఉండేది' అని వాపోయాడు. నిజమైన జ్ఞానాన్ని పొందిన వారు, స్వప్న ప్రపంచంలో కనిపించినవి ఎలా అసత్యమో, అలాగే జాగ్రదావస్థలోని వస్తుజాలమంతా హుళక్కే అని గుర్తిస్తారు. అయం వ్యర్థో బాహ్యే కోపి న భవతి। ఆ విధంగా గుర్తించిన వారికి, ఇదంతా వ్యర్థమే అని తెలుస్తుంది. ఇట్టి జ్ఞాన సంపద మహాత్ముల ద్వారా మనకి లభిస్తోంది. వ్యవహారంలో ఉన్నప్పుడు అన్నీ కావాలి. పెళ్ళికి వెళ్తే నగలు, పట్టు చీరలు, ఆ వివాహం అయ్యేంతవరకే వాటి అవసరం. ఆ తరువాత వాటి అవసరం ఉండదు.

సఏవహి మహా దేవ స్సవహి మహా హరిః

సఏవహి జ్యోతిషాం జ్యోతి స్సఏవహి పరమేశ్వరః।

ఆయనే మహా దేవుడు. ఆయనే విష్ణువు. ఆయనే జ్యోతులకు జ్యోతి అయినవాడు. ఆయనే పరమేశ్వరుడు.

స ఏవహి పరంబ్రహ్మ తద్బ్రహ్మాZ హం న సంశయః

జీవ శ్శివ శ్శివో జీవః స్సజీవః కేవలం శివః।

అతడే (విష్ణువే) పరబ్రహ్మ. నేను ఆ బ్రహ్మమే. ఇందులో సంశయం లేదు.

జీవుడే శివుడు. శివుడే జీవుడు.

తుషేన బద్ధో వ్రీహిస్స్యాత్, తుషా భావేతు తండులః।

ఏవం బద్ధ స్తదా జీవః కర్మ నాశే సదా శివః॥

మనలో ప్రాణం అనే చైతన్యం వల్లనే ఈ శరీరం ప్రకాశిస్తోంది. అది తప్పుకుంటే ఈ శరీరాన్ని తగులపెడ్తారు. ఆ చైతన్య శక్తే సృష్టిలో ప్రకాశిస్తోంది. దానిని గుర్తించినవారే మహాత్ములు. ఊక చేత కప్పబడినప్పుడు వడ్లు అంటాం. ఆ పొర తొలిగితే బియ్యం అంటాం. వడ్లను నాటితే మొలకెత్తుతాయి. కాని బియ్యం తిరిగి మొలకెత్తవు. అలాగే జీవుడు కర్మ బద్ధుడై ఉన్నాడు. కర్మ నాశనమైతే సదా శివుడవుతున్నాడు.

పాశబద్ధ స్సదా జీవః, పాశముక్త స్సదా శివః

శివాయ విష్ణు రూపాయ, శివ రూపాయ విష్ణవే।

కర్మ పాశములతో కట్టబడితే జీవుడు. పాశముక్తుడైతే శివుడు అవుతున్నాడు.

శివస్య హృదయం విష్ణుః, విష్ణోశ్చ హృదయం శివః

యథా శివమయో విష్ణు రేవ ,విష్ణుమయ శివః।

యథాఽన్తరం న పశ్యామి, తథామే స్వస్తిరాయుషీ

యథాఽన్తరం న భేదాన్స్యు శివకేశవయోస్తథాః।

శివుని హృదయమే విష్ణువు. విష్ణువు యొక్క హృదయమే శివుడు. శివ కేశవులలో భేదం లేదని తెలిసికున్నప్పుడు ఆయుష్షు, సంతోషము కలుగుగాక! శివ కేశవులలో భేదం లేదని గ్రహించాను.

ఈ విషయాన్ని గుర్తింపచేసేది గురుదేవులొక్కరే. తండ్రి వానావల్లప్పలు ఆడిస్తూ పిల్లవాడి చెయ్యి పట్టుకునే ఉంటాడు. అప్పుడు ఆ పిల్లవాడికి ఏ ఆపదా రాదు. అదే పిల్లవాడు తండ్రి చెయ్యి పట్టుకుంటే పట్టు తప్పి పడిపోతాడు. దీనినే మార్జాల కిశోర న్యాయం, మర్కటకిశోర న్యాయం అంటారు. మనది మార్జాల కిశోర న్యాయం. మన చెయ్యిని గురుదేవులు పట్టుకొని ఉన్నారు.

అనేక జన్మల పుణ్యం రాశీభూతమై ఈ మానవ జన్మ వచ్చింది. దానిని సార్థకం చేసకోవాలంటే శ్రీగురుదేవులు సూచించిన మార్గంలో నడుచుకోవాలి. ఈ దేహం దేవాలయం, జీవుడు మంగళరూపుడైన సదాశివుడు అనే విషయం అజ్ఞానం అనే నిర్మాల్యాన్ని త్యజించి శివోఽహం

- ఆ శివుడను నేనే అనే భావంతో పూజించాలి. నామ రూపాలను, జాతి నీతి కుల గోత్రాలను వర్జించి సత్య వస్తువును గుర్తించటమే జ్ఞానము. మనస్సును నిర్విషయం చేసుకోవటమే ధ్యానం. మనోమలాన్ని తొలగించుకోవటమే స్నానము. ఇంద్రియనిగ్రహమే శౌచము. బ్రహ్మ భావంతో ఉండి బ్రహ్మామృతాన్ని పానం చేయాలి దేహ రక్షణ కొరకై భిక్షను గ్రహించాలి. ఏకాంత వాసం చేయాలి. ఈ విధంగా బ్రహ్మము తప్ప ఇతరము లేదని వర్తించే ధీమంతుడు ముక్తిని పొందుతున్నాడు. ఆ పరంజ్యోతికి నమస్కరిస్తున్నాను. అట్టి జన్మ రాహిత్య స్థితిని పొందుదును గాక! ఓ దేవా! నీ ప్రసాదము చేత అనంతము, అచింత్యము ,అవ్యయము అయిన పర బ్రహ్మ స్వరూపమును నేను తెలుసుకున్నాను" అని శ్రీ కుమారస్వామి తన తండ్రియైన సదాశివునికి తన అనుభవాన్ని వివరించాడు. మనకు శ్రీ సదా శివ బ్రహ్మేంద్రుల వారు - సర్వం బ్రహ్మమయం రేరే। అనే కీర్తనలో 'సర్వత్ర సదా హంస ధ్యానం। కర్తవ్యం భో ముక్తి నిదానం ॥' అని తెలిపారు. హంస ధ్యానం అంటే ఉచ్ఛ్వాస నిశ్వాసలే సోZహం. ఎల్లప్పుడూ ఆ స్థితిలో ఉండటమే ముక్తి నిదానము.

తనను తాను మరిచే స్థితిని, అట్టి నిజ దృష్టిని శ్రీ గురుదేవులు మనందరికీ ప్రసాదించెదరు గాక! సుఖీభవ!!

## పెదనింద్రకొలను శాఖలో కార్యక్రమాలు

జనవరి 2016

4 సోమ శ్రీ గురుదశమి. ఉదయం 5-30. శ్రీసద్గురుపాదపూజ

14 గురు భోగి రాత్రి 7గం.లకు భోగిపళ్ళుపోయుట, శ్రీసద్గురు పాదపూజ

ఫిబ్రవరి 2016

3 బుధవారం శ్రీగురుదశమి; రాత్రి 7గం. శ్రీసద్గురుపాదపూజ

14 -18వరకు శ్రీసద్గురుదేవుల మూర్తి ప్రతిష్ఠ ద్వాదశవార్షికోత్సవాలు, సత్సంగం, కుంభాభిషేకం.

22 సోమవారం గురుపూర్ణిమ ఉదయం 11గం.లకు శ్రీసద్గురు పాదపూజ.

# సత్సంగామృతం

(గత సంచిక తరువాయి)

- మురళీ

మళ్ళీ జన్మ వస్తే, యే జన్మ వస్తుందో తెలియదు. ఉత్కృష్టమైన మానవ జన్మ వస్తుందనే గ్యారంటీ లేదు. సమర్థులైన గురుదేవులు దొరుకుతారనే గ్యారంటీ అసలేలేదు. ఎందుకంటే మనలో ఒకరిగా మెలిగి మనకు యిటువంటి దివ్య జ్ఞానాన్ని అందించి, యిది నీది రా! నీ స్వంతం అని తెలియజేసే గురుదేవులు చాలా అరుదుగా లభిస్తారు. వారు నిన్ను నువ్వు గుర్తించు. నీలో అమూల్యమైనది ఒకటున్నది సుమా! అని గుర్తుచేస్తారు.



ఇటువంటి సత్సంగంలో సద్విషయాన్ని విచారణ చేసుకోవటానికి డబ్బు ఖర్చు అవుతుందా? సత్సంగంలో సద్వినియోగం చేసుకున్న కాలం, నీ సత్యకాలంలో జమ అవుతుంది అన్నారు శ్రీగురుదేవులు. నిద్ర శాశ్వత నిద్ర అయ్యేముందు, అసలు శాశ్వత మైనదేదో గుర్తించాలి. శాశ్వతమైన సత్యం నిగూఢంగా వుంటుంది. దానిని గుర్తించటం కోసం పరమాత్మ చింతన చేయాలి. ఉత్కృష్టమైన మానవ జన్మ వచ్చినందుకు లౌకిక విషయాదులపై కాక, పరమాత్మపై దృష్టిపెట్టాలి.

ఇది క్షర విద్య కాదు. అక్షర పరబ్రహ్మ స్వరూపమై నటువంటిది. అవిద్యను నాశనము చేసే బ్రహ్మవిద్య. ఇటువంటి బ్రహ్మవిద్యను మనకు గుర్తింపచేస్తున్నారు శ్రీగురుదేవులు. ఎప్పుడైతే అర్థ కామాలు ధర్మాన్ని ఆశ్రయించి వుంటాయో మోక్షము కూడా అందులో భాగమే. నీకు ముక్తి కూడా అప్పుడే లభిస్తుంది. అందుకనే మనం తనను తాను గుర్తించే ప్రయత్నం చేయాలి. ఈ జీవితం

వుండగానే దానిని విచారణ చేసి, తనను తాను గుర్తించక పోతే, యీ జీవితం వృథా అయిపోతుంది. మహాత్ములు తత్వస్వరూపులు. గురుదేవుల యొక్క దివ్యచరణార విందముల యందు లగ్నం కాని, మనస్సున్నవాడికి యెన్ని వుంటే మాత్రం ఏమి లాభం? ఎంతటి గొప్పవాడైతే మాత్రం గురుదేవుని యందు భక్తి లేకపోతే యేమి లాభం? ఏనాడు భగవత్పదాబ్జములను పట్టుకున్నామో, ఆనాడే చరితార్థ జన్ములమైనాము. శ్రీగురుదేవులు మనకు ఆ అవకాశాన్ని ప్రసాదించారు. శ్రీగురుదేవులు 'కామవరపుకోట జీడిని నన్ను వదిలించుకోవటం మీ వల్ల కాదు' అనేవారు.

స్వాతి చినుకు వేడి పెనం మీద పడితే మాడిపోతుంది. నీళ్లల్లో పడితే నీటిపాలవుతుంది. ఆ చినుకు ముత్యపు చిప్పలో పడితేనే ముత్యం అవుతుంది. అలాగే మహాత్ముల యొక్క బోధామృతం వినే సమయంలో ముత్యపు చిప్పలాగ మనం యెదురు చూస్తూ వుండాలి. బోధామృతాన్ని గ్రోలగానే ఆ ముద్రలో హాయిగా ఆనందించాలి. గురు లక్ష్యార్థాన్ని పెట్టుకుని ఆనందిస్తే ఫలితాన్నిస్తుంది.

గురుదేవులు సత్యస్వరూపులు. అమృత స్వరూపులు. వారి దర్శనం పొంది, వారి దివ్య బోధామృతం శ్రవణం చేస్తూ, తాదత్మ్యం చెందితే, మన జన్మ ధన్యమైనట్లే!

బ్రహ్మ - సత్యం, జ్ఞానం, అనంతం. కాబట్టి సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ అయినటువంటి ఆ గురుదేవుల కరుణకు మనమందరం పాత్రులమౌదుము గాక! సద్గురు నాథుడు సర్వదా రక్షించుగాక! సుఖీభవ! సుఖీభవ!!

## గమనిక

*[గత మాసపత్రికలో కవర్ పేజీలో వస్త్రదానం ఛాయాచిత్రాలను పొరపాటుగా 'శరన్నవరాత్రి సందర్భంగా' అని ప్రచురించటం జరిగింది. 'శ్రీమాతాజీ షష్ఠిపూర్తిమహోత్సవ సందర్భంగా' అని పాఠకులు గమనించవలెను.]*

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

(గత సంచిక తరువాయి) - విజయేశ్వరానంద ప్రసాద్

## కోటిపల్లి మామ్మగారు

తర్వాత శ్రీ బాబు వచ్చినప్పుడు విజయ ఏడుస్తూ "ఆ రోజు మీరు జామ పండు తింటూ నాకు కూడ ఒక ముక్క పెట్టారా, లేదా? మరి వాళ్ళు వచ్చి చూస్తే, మీరు కనబడకుండా నా చేత దెబ్బలు తినిపించారు" అన్నది. శ్రీ బాబు నవ్వుతూ "నువ్వు చెప్పినదంతా నిజమేనమ్మా! నువ్వు చాలా మంచిదానవు, కాని నేను తినటం వాళ్ళు కూడా చూడాలంటే, వాళ్ళు కూడా నీ అంత మంచి వాళ్ళు కావాలి" అన్నారు. "నిజమే పసిపిల్లల వంటి నిర్మల మనస్తత్వం ఉంటే గాని భగవంతుడు కనబడడు" అనుకున్నారు వాళ్ళందరూ.



ఒక రోజు శ్రీ బాబు కోటిపల్లి వచ్చి సాయంత్రం వరకూ ఉండి, చీకటి పడుతుండగా "అర్జంటుగా ముంజవరపుకొట్టు వెళ్ళాలి" అని బయల్దేరారు. ఆ టైముకు బస్సులు లేవు. గోదావరి పొంగి పొర్లుతూ ఉండటం వల్ల, చీకట్లో పడవ గాని, లాంచి గాని నడపరు. ఎంత చెప్పినా వినకుండా శ్రీ బాబు బయల్దేరారు. కోటిపల్లి తాతయ్యగారు ఆవేదన పడుతూ, తెల్లవార్లూ వాకిట్లో అరుగు మీదనే గడిపి , పొద్దున్నే ముంజవరపుకొట్టు వెళ్ళారు. అక్కడకు శ్రీ బాబు ముందు రోజు రాత్రి ఏడు గంటలకే వచ్చేశారని తెలిసింది.

పోతునూరు అక్కయ్యకు తమ నాలుగో అమ్మాయి ఉష ఆస్పత్రిలో జన్మించే సమయానికి ఎవరూ దగ్గర లేరు. పురుడు రాక చాల బాధ పడుతున్న సమయంలో శ్రీ బాబు వచ్చి అభయమిచ్చి వెళ్ళినట్లు దర్శనమైంది. వెంటనే తేలికగా పురుడు వచ్చింది గాని, అతి వికృతమైన ఆకారంతో, కలిసి ఉన్న రెండు తలలతో ఆడపిల్ల పుట్టింది. ఎవరికైనా చూపించటానికి కూడ మనస్సు ఒప్పటం లేదు. పిల్ల చనిపోయినా బాగుండును అన్నంత విరక్తి కలిగింది ఆమెకు.

వద్దన్నా వినకుండా, దసరాలలో పిల్లకు నామకరణం చేయించవలసినదే అని, గుండుగొలనులో మేడబాబుగారింటికి (కొండ బుల్లి వెంకటరాజుగారు) మామ్మగారు తల్లిని, పిల్లనూ దసరా పూజలకు తీసుకొని వెళ్ళారు. దయామయులైన శ్రీ బాబు వాళ్ళను ప్రత్యేకంగా పిలిచి,"ఉషారాణి" అని నామకరణం చేసి అక్షతలు వేశారు. తెల్లవారేసరికి పిల్ల రెండో తల లేకుండా సలక్షణంగా ఉన్నది! పురుడు పోసిన డాక్టరు తరుణమ్మగారు రామ భక్తురాలు. ఆమె పాపను చూసి ఆశ్చర్యపడి, "యింతటి మహాత్ముడైన శ్రీ బాబును దర్శించుకోవా"లని ఆ దసరా పూజలలోనే గుండుగొలను వెళ్ళింది. శ్రీ బాబు దర్శనము చేసికొని, వుపన్యాసము విని "మీ గురువుగారు మానవ మాత్రులు కారు. వారు నాకు కోదండరామ ప్రభువుగా దర్శన మిచ్చారు. నా జన్మ ధన్యమైనది" అని అమితానందంతో చెప్పింది. ఆశ్రమ స్థాపనానంతరము ఆమె ఒకసారి ఆశ్రమానికి కూడ వచ్చి శ్రీబాబు దర్శనం చేసుకుని వెళ్ళింది.

ఒకప్పుడు ఒక దొంగల ముఠా కోటిపల్లి, రామచంద్రాపురం ప్రాంతాలకు వచ్చింది. ఆ దొంగలు యిళ్ళల్లో పనిచేసే పాలేళ్ళద్వారా యింటి గుట్టు మట్లు తెలుసుకుని, యిళ్ళల్లో పడి దోచుకోవటం మొదలు పెట్టారు. కోటిపల్లిలో యించుమించు అన్ని యిళ్ళలోనూ దొంగతనాలు జరిగాయి. కాని కోటిపల్లి మామ్మగారింట్లో మాత్రం జరగలేదు. ఒకసారి రామచంద్రపురంలో ఉన్న పెద్ద బట్టల షాపులో పడి ఆ దొంగలు బేళ్ళకు బేళ్ళు దోచుకు పోయారు. పోలీసులు నిఘా వేసి ముఠాను పట్టుకున్నారు.

వాళ్ళ విచారణలో తేలిన విషయమేమిటంటే , కోటిపల్లిలో అందరి యిళ్ళలోనూ దొంగతనం చేశారు గాని మామ్మగారింట్లో దొంగతనం చేయలేక పోయామని వాళ్ళు పోలీసులతో చెప్పారు. ఆరు సార్లు ప్రయత్నించారట. ఒకసారి ఒకడు దొడ్డి గోడ మీద నుంచి లోపలికి దూకబోతుంటే ఎవరో బలంగా త్రోసివేసినట్లు పడిపోయాడు. మరొకడు షెడ్డు మీద నుండి దిగబోవటం, మరొకరు బావి గట్టు మీదకు దిగబోవటం యిలా అయిదుగురు ప్రయత్నం చేస్తే, ప్రతి ఒక్కరిని ఎవరో చాలా బలంగా త్రోసినట్లు కింద పడి, బొమికలు విరగ గొట్టుకుని, బ్రతుకు జీవుడా అని పారిపోయి వచ్చారట.

- సశేషం

## విష్ణు  కథలు

- రమణ ప్రసాద్

# కబీర్‌దాస్

కబీర్ శవానికి హిందువులు అగ్ని సంస్కారం చేయాలని తలపెట్టారు. ముసల్మాన్ శిష్యులు కబీర్ శవాన్ని పాతిపెట్టాలని అన్నారు. రెండు పక్షాలలో వివాదాలు చెలరేగాయి. ఆ సమయంలో కబీర్ శవంపై ఉన్న బట్ట తీయగా శవం స్థానంలో పువ్వుల గుట్ట ఉంది. ఆకాశంలోనుండి పడ్డ నీరు సాగరంలో కలిసినట్లు, కబీర్ ఆత్మ అనంత చైతన్యంలో కలిసిపోయింది. కబీర్ దోహాలలో, కబీర్ కీర్తనలలో భగవత్తత్త్వం నిండి ఉంది. అవి ప్రజానీకానికి సందేశాత్మకంగా, ప్రేరణాత్మకంగా ఆచరణ మార్గాలను సూచిస్తూ ఉంటాయి.



ఈ క్రింది ఇచ్చిన దోహాలు కబీర్‌దాస్‌కు అక్షర నీరాజనం

గురు బిన్ మాలా ఫేరతా, గురు బిన్ కరతా దాన్ ।
గురు బిన్ నిషఫల్ గయా బూఝో వేద పురాణ్ ॥

గురువు లేకుండా జపమాల తిప్పటం, దానం చేయటం అంతా నిష్ఫలమే అని వేద పురాణాలు ఘోషిస్తున్నాయి. ఇది గ్రహించు.

తూతూ కరతా తూ భయా, తుఝుమే రామ సమాయ్
తుఝుమాహీ మన్ మిల్‌రహా, అబ్ కహు అనతన జాయ్॥

నీవేమో నువ్వు, నువ్వు అంటున్నావు. నీలోనే ఉన్నాడు భగవంతుడు. నీలోనే మనస్సు లయమవుతోంది. అందువలన లోపల వెతుకు, బయట వెతకకు.

ఏక్ ఘడీ, ఆధీ ఘడీ, ఆదీ హూసే ఆదీ ।
కబీర్ సంగతి సాధకే కటై కోటి అపరాధ్ ॥

సాధువుల సాంగత్యంలో ఒక ఘడియ లేదా అర్థ ఘడియ లేకపోతే కనీసం అందులో సగం సమయం అయినా గడిపితే చాలు.కోటి అపరాధాలు నశిస్తాయి అంటున్నాడు కబీర్.

రాత్ గవాయ్ సోయికే, దివస్ గవాయ్ ఖాయికే।
హీరా జనమ్ అనమోల్ థా కౌడీ బదలే జాయ్॥

నిద్రలో రాత్రంతా గడిచిపోతుంది. ఆహార వ్యవహారాలలో పగలు గడిచిపోతుంది. ఎంతో విలువైన వజ్రంతో సమానమైన మానవజన్మ గుడ్డి గవ్వవలె ప్రపంచ విషయంలో గడచిపోతోంది.

లూట్ సకే తో లూట్‌లో రామ్ నామకీ లూట్
ఫిర్ పాచే పచతా వోగే ప్రాణ జాయేంగే ఛూట్

రామనామం అనే ధనాన్ని లూటీ చెయ్యి ఎంతకావాలో అంత తీసుకుపో. అలా చేయలేకపోతే ప్రాణం పోయేటప్పుడు పశ్చాత్తాపం తప్పదు.

కల్ కరే సో ఆజ్ కరూఁ ఆజ్ కరైసో అబ్।
పల్‌మే పరలై హోయగీ, బహరీ కరేగా కబ్॥

రేపు చేసేది ఈ రోజు చేయ్యి. ఈరోజు చేసేది ఇప్పుడే చెయ్యి. క్షణంలో ప్రళయం రావచ్చు. అప్పుడు ఏమీ చేయలేవు.

మాలా ఫేరత్ జుగ్ గయా ఫిరాన మనకా ఫేర్।
కర్‌కా మన్‌కా డాలికే మన్‌కా మన్‌కా ఫేర్॥

జపమాల తిప్పుతూ యుగాలు గడిచినా, మనస్సులోని కదలికలు ఆగవు. నీ మనస్సును మనస్సులో లయింపచేస్తే మనస్సు కదలికలు ఆగిపోతాయి.

కోటి నామ్ సంసారమే తాతేముక్తి న హోయ్।
ఆదినామ్ జో గుప్తజప్, బూఝై బిరలా కోయ్॥

అనంత నామాలు భగవంతుడివే. కాని వాని వల్ల ముక్తి లభించదు. ఆది నామం ఆంతరికంగా జపించటం అభ్యాసం చేయాలి. ఈ సూక్ష్మం ఏ ఒక్క మహాత్ముడో గ్రహించగలుగుతాడు.

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL